సోమవారం
01-1-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 190
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

14 రోజుల్లో 20 వేల మందికిపైగా అరెస్టు

కొలంబో: శ్రీలంకలో మాదకద్రవ్యాలకు సంబంధించి నేరాల్లో 20వేల మంది నిందితులు అరెస్టు అయ్యారు. ప్రత్యేక ఆపరేషన్ ద్వారా 14 రోజుల్లోనే 20,792 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రజా భద్రతా శాఖ ఆదివారం తెలిపింది. అలాగే 11.6కేజీల హెరాయిన్, 8.3కిలోల క్రిస్టల్‌మెత్, 297 కిలోల గంజాయి సహా ఇతర డ్రగ్స్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించింది. కొందరి ఆస్తులనూ జప్తు చేసినట్లు తెలిపింది. పట్టుబడిన డ్రగ్స్ మార్కెట్ విలువ 558 మిలియన్ల రూపాయలని పేర్కొంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు డిసెంబరు 17న ఈ ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు మంత్రిత్వశాఖ వెల్లడించింది.

భూసర్వేలో అవకతవకలు

4న 'భూ రక్ష' పాస్‌బుక్ ప్రతుల దగ్ధం సీపీఐ రాష్ట్ర కార్యవర్గం పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: భూ సర్వే సందర్భంగా అవకతవకలతో తయారుచేసిన పాస్ పుస్తకాల ప్రతులను జనవరి 4వ తేదీన బహిరంగంగా దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక దాసరి భవన్‌లో ఎన్ రంగనాయుడు అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అంతర్జాతీయ పరిస్థితులను, జాతీయ రాజకీయ పరిణామాలను వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, భవిష్యత్ కర్తవ్యాల గురించి తెలిపారు. పార్టీ జాతీయ కార్యవర్గసభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు. చర్చల అనంతరం సమావేశం కింది తీర్మానాలను ఆమోదించింది.

జగనన్న "భూ రక్ష పథకం" క్రింద పట్టాదార్ పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతో ముద్రించి రైతులకు అందజేస్తున్నారు. రైతులకు అందజేసిన ఈ పాస్ పుస్తకాలు నిరుపయోగంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. గతంలో ఈ-పాస్ పుస్తకాలు భూమి అమ్మకాలు, కొనుగోలుకు, బ్యాంకులో రుణాలు పొందటానికి ఉపయోగపడేవి. ప్రస్తుతం భూ సమగ్ర సర్వే పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అనంతరం రూపొందించిన పట్టాదారు పాసుపుస్తకాలు భూమి రిజిస్ట్రేషన్‌కు, తనఖా పెట్టుకోవటానికి రుణాలు పొందడానికి ఏమాత్రం ఉపయోగం లేదు. రీ సర్వే నిర్వహణ సందర్భంగా క్షేత్రస్థాయిలో పెద్ద సంఖ్యలో అవకతవకలు జరిగాయని, రైతులకు ఉమ్మడి హక్కు పత్రాలు ఇవ్వటం వలన అనేక వివాదాలకు దారితీసి రైతుల మధ్య చిచ్చు పెడుతున్నది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమం వివిధ రకాల అవకతవకలకు దారితీసి అబాసుపాలైంది. ఇప్పటికైనా సర్వే నిర్వహించేటప్పుడు ఖచ్చితమైన సాంకేతిక పరికరాలను వినియోగించకుండా త్వరితగతిన పూర్తి చేయాలనే తొందరపాటు వల్ల తప్పులు దొర్లుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరిగిన లోపాలను సరిదిద్దాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నది. డిప్యూటీ తహశీల్దారు, మండల సర్వేయర్లతో ఏర్పడిన బృందం దృష్టికి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తీసుకెళ్లినా పరిష్కరించడానికి చొరవ చూపటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న భూ

- మిగతా 2 లో

2024 నీదే... భవిష్యత్తూ నీవే!

విరుచుకుపడే అల ఎదురైతే
తిరగబడే తీరం నీవే
అక్రమాలపై అగ్నికణమై
గతితప్పిన సర్కార్లకు పెనుముప్పవై
మతోన్మాదం మెడ విరిచేయ్
అవినీతి తల నరికేయ్
కొత్తయేడులో పోరుబాట నీదే
చీకటిచీల్చే వెలుగు రేఖవు నీవే

- నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

ఉద్దానం ఉసూరు!

ఉపాధి కరువై బతుకు భారం

వలసపోతున్న యువత

పాలకులకు పట్టని వైనం

విశాలాంధ్ర-కవిటి(శ్రీకాకుళం) : ఉద్దానం ఉసూరుమంటోంది. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని ఛిద్రం చేస్తున్న కిడ్నీ వ్యాధి ఒక వైపు అయితే, ప్రకృతి ప్రకోపానికి పంటలు దెబ్బతిని ప్రజలు, రైతులు మానసికంగా, ఆర్థికంగా నలిగిపోతున్న దయనీయ పరిస్థితులు మరోవైపు ఉన్నాయి. ఇదంతా ఉపాధిని తీవ్రంగా దెబ్బతీసి, ప్రజల బతుకును భారంగా మార్చింది. కిడ్నీ రాకాసి ఊళ్లను ఖాళీ చేయిస్తోంది. ఇక ప్రకృతి విపత్తులకు పంటలు దెబ్బతినడంతో ఉన్న ఊరులో ఉపాధి కరువై గ్రామాల్లో ఉండలేక యువత వలస బాట

- మిగతా 2 లో

వ్యవసాయం దండగ

రెండు నెలలకు ఒకసారి వ్యవసాయానికి పెట్టుబడి పెడితే అప్పుల పాలవుతున్నాం. కష్టపడి సాగు చేసినా పెట్టుబడి కూడా రావడం లేదు. స్థానికంగా ఉపాధి దొరికే పరిస్థితి లేదు. వలసలు వెళ్లి ఏదొక హోటల్‌లోగానీ, ఇంట్లోగానీ పని చేసుకుంటే కుటుంబ పోషణకు ఎంతో కొంత చేతికందుతోంది. తప్పని పరిస్థితుల్లో వలసలు వెళుతున్నాం. తల్లిదండ్రులను వదిలి వెళ్లాలంటే బాధగా ఉంది.

- పాండు దొలై, బల్లి పుట్టుగ

పచ్చిమిర్చి కనుమరుగు

2లో

సర్వం సర్వేలే!

- ఆశల పల్లకిలో ప్రధాన పార్టీలు
- కొత్త ఏడాదిలో ఎన్నికలపైనే దృష్టి
- టికెట్ల కేటాయింపుపై తీవ్ర కసరత్తు
- ఏజెన్సీలిచ్చే నివేదికలే కొలమానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలంతా నూతన సంవత్సర సంబరాల్లో ఉండగా... ప్రధాన రాజకీయ పార్టీలు మాత్రం తమ భవితవ్యాన్ని సర్వే సంస్థలకు వదిలేశాయి. కొత్త ఏడాదిలో శుభం కలగాలని, రాష్ట్రం బాగుండాలని ప్రజలు ఆశిస్తుండగా... రాజకీయ నేతలేమో తమ భవిష్యత్తుతోపాటు రాబోయే ఎన్నికల్లో పార్టీ స్థితిగతులపై దృష్టి సారించారు. సర్వే సంస్థలు సూచించిన విధంగానే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి, పనితీరులో వెనుకబడిన వారికి టికెట్లు నిరాకరిస్తున్నారు. కొందరికి స్థానచలనం కల్పిస్తున్నారు. ఐ ప్యాడ్, కేంద్ర సర్వే, ఎంపీ మిథున్‌రెడ్డి వ్యక్తిగత సర్వే, ఏపీ ఇంటిలిజెన్స్ తదితర సర్వేల ఆధారంగా సీఎం టికెట్ల కేటాయింపులకు సిద్ధమయ్యారు. ఆ నాలుగు సర్వేల్లోనూ వెనుకబాటుకు గురైన వారిపై వేటు వేస్తున్నారు. 175 నియోజకవర్గాల వారీగా సీఎం జగన్ 70శాతం వరకు అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసినట్లు తెలిసింది. మిగిలిన జిల్లాల్లోని నియోజకవర్గ ఎమ్మెల్యేలను పిలిపించనున్నారు. మరోసారి ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం వేర్వేరుగా భేటీలు నిర్వహించి, నూతన ఇన్‌చార్జిలను ప్రకటించనున్నారు. ఈ ప్రకటించబోయే ఇన్‌చార్జిలకే

- మిగతా 2 లో

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ58

25 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం

8లో



రెండు యుద్ధాల నడుమ...!

ఎ.బి.కూన

రెండు అతిపెద్ద యుద్ధాలు 2023లో ప్రపంచాన్ని వణికించాయి. ఇంకా వణికిస్తూనే ఉన్నాయి. పశ్చిమాసియా నుంచి దక్షిణ అమెరికా వరకూ ఘర్షణల వాతావరణమే నెలకొన్నది. ఇజ్రాయిల్-పలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలు భయానక పరిస్థితులను నెలకొల్పాయి. ముఖ్యంగా ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య యుద్ధం బీభత్సంగా సాగుతోంది. ఆపరేషన్ అల్ అక్సా ఫ్లడ్ పేరుతో అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయిల్‌పై గాజా చేసిన దాడిలో 1400 మంది చనిపోయినట్లుగా చెపుతున్నారు. అక్కడి నుంచి ఇజ్రాయిల్ ప్రతీకార దాడులు చేసింది. ఈ దాడుల్లో గాజాస్ట్రిప్‌లోని వేలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 85 రోజులుగా యుద్ధం కొనసాగుతూనే వుంది. గాజాలో మృతుల సంఖ్య 20 వేలు దాటినట్లుగా చెపుతున్నారు. వారిలో సగం మంది మహిళలు, పిల్లలే. రాజకీయ ఉనికి కోసం పాట్లుపడుతున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు గాజాపై విచక్షణారహిత దాడులకు పూనుకోవడాన్ని ప్రపంచం గర్హించింది. అయితే అమెరికా సమర్ధిస్తూనే ఉంది. పైగా ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలను సమకూర్చుతోంది. ఐక్యరాజ్య సమితి ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. పిల్లలు, మహిళల దయనీయ స్థితిపై జాలిచూపుతోంది. కానీ ఏం చేయలేని పరిస్థితుల్లో మౌనం వహించింది. ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. శాంతి ఒప్పందం కోసం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఆ దేశం అమెరికావైపు చూస్తున్నది. ఈలోగా ఎర్రసముద్రంపై హమాస్ మద్దతుదారులైన హౌతీలు బాంబుదాడులు చేసి ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీశారు. భారత్ కూడా ఈ సందర్భంలో నష్టపోయింది.

రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య 2022లో మొదలైన యుద్ధం ఈ ఏడాది కూడా కొనసాగింది. అమెరికా రెచ్చగొట్టడంతో ఆ దేశ సహకారంతోనే ఉక్రెయిన్ బలమైన ఆయుధ సంపత్తిని సాధించి, రష్యాపై దాడులు చేస్తున్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఓడిపోయే పరిస్థితి ఉంటే ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు చెపుతున్నారు. రెండు దేశాలు ప్రతిరోజూ విజయాలు, పరాజయాలు నమోదు చేసుకుంటూనే ఉన్నాయి. అమెరికాతోపాటు, కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు బేషరతుగా మద్దతునిచ్చాయి. అయితే ఆ దేశాలు ఇప్పుడు ఇజ్రాయిల్‌వైపు దృష్టి పెట్టడంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ ఆందోళనలో పడ్డారు. ఉక్రెయిన్ మొండివైఖరి కూడా చాలా దేశాల సహనాన్ని పరీక్షించేలా చేశాయి.

ఆర్మీనియా, అజర్‌బైజాన్‌లు నగోర్నో-కరబఖ్ ప్రాంతంపై చిరకాలంగా ఘర్షణ పడుతున్నాయి. ఇదొక చారిత్రిక, వ్యూహాత్మక పాయింటు. 2020లో కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఈ ఏడాది ప్రారంభంలో రెండు రోజులపాటు జరిగిన యుద్ధంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీనియా నుంచి నగోర్నో-కరబఖ్ వైపు సైనిక సంపత్తిని పంపించేందుకు వీలుగా హైవేపై ఉన్న చెక్‌పాయింట్‌ను తెరవాలని బాకు నిర్ణయించింది. ఈ పోరు మరోసారి తలెత్తే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ విషయంలో అమెరికా, ఈయూ, రష్యా వరుస చర్చలు జరుపుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రాధాన్యత గల సరిహద్దులను అధికారికంగా గుర్తించాలని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అజర్‌బైజాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఏదేమైనప్పటికీ, ఈ సమస్యపై దౌత్యపరమైన కృషి జరుగుతోంది. అజర్‌బైజాన్‌కు రష్యా, టర్కీ వంటి దేశాలు అండగా నిలిచాయి. దీన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని అమెరికా చూస్తోంది. జనవరి 1 వరకు ఈ ప్రాంతంలో అన్ని ప్రభుత్వ కార్యకలాపాలు రద్దయ్యాయి.

2023లో వెనిజులా-గుయానా మధ్య ఎస్సెక్విబో సంక్షోభం కూడా ప్రపంచానికి తలనొప్పిగా మారింది. వివాదాస్పద ఎస్సెక్విబో ప్రాంతం వ్యవహారంలో పొరుగునున్న గుయానాను ఆక్రమించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెనిజులా అధ్యక్షులు నికొలస్ మదురో సంకేతాలిచ్చారు. గుయానా దేశాభివృద్ధికి అవసరమైన చమురు నిల్వలన్నీ ఎస్సెక్విబో ప్రాంతంలోనే ఉన్నాయి. అమెరికా దీనిపై కన్నేసినట్లుగా తెలుస్తోంది. అందుకే వెనిజులా దీని ఆక్రమణకు రంగం సిద్ధం చేస్తోంది. అయితే మదురో ప్రకటనలపై గుయానాతోపాటు బ్రెజిల్ కూడా అప్రమత్తమైనట్లు సమాచారం.

ఇవికాకుండా, భారత్ ఆతిథ్యంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు, అలాగే బ్రిక్స్ సదస్సుల్లో వివిధ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఎక్కువగా పశ్చిమ దేశాలు లబ్ధిపొందేలా ఈ ఒప్పందాలు ఉన్నాయి. చైనాను నియంత్రించే క్రమంలో అమెరికా ప్రేరేపిత అవగాహనలు కొన్ని ఉన్నప్పటికీ, చైనా వాటన్నింటినీ తిప్పికొట్టింది. పాకిస్థానీ ఆఖరి నియంత పర్వేజ్ ముషారఫ్ నుంచి చైనా మాజీ ప్రధాని లీ లెక్వియాంగ్ వరకు చాలామంది ప్రముఖులను ఈఏడాది ప్రపంచం కోల్పోయింది. అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు హెన్రీ కిసింజర్ కన్నుమూశారు. ప్రచ్ఛన్నయుద్ధం, వియత్నాం యుద్ధ సమయాల్లో ఆయన కీలక భూమిక పోషించారు. ఇరాన్-సౌదీ నిర్బంధం కూడా వార్తల్లో నిలిచింది. సున్నీలు ఆధిపత్యం గల సౌదీ అరేబియా, షియాలు ఆధిపత్యం గల ఇరాన్‌ల మధ్య చిరకాల శత్రుత్వం ఉంది. దీని వల్ల ఇరాక్, సిరియా, లెబనాన్, యెమెన్, బహ్రెయిన్ వంటి ఇతర ప్రాచ్యదేశాలు ఇబ్బంది పడుతున్నాయి. వీటి మధ్య ఘర్షణను నివారించేందుకు చైనా మధ్యవర్తిగా వెళ్లేందుకు కృషి చేస్తోంది. అమెరికా ఆంక్షలను ఎత్తివేయాలన్నదే ఇరాన్ అధ్యక్షుడు ఆయితుల్లా ఖొమేనీ ప్రధాన డిమాండ్‌గా ఉంది. అమెరికా ప్రోత్సాహంతో సౌదీకి ఇజ్రాయిల్ మద్దతు ఇస్తోంది. ఇది తీవ్రరూపం దాల్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఫిబ్రవరిలో సంభవించిన టర్కీ-సిరియా భూకంపంలో టర్కీలో 59,000, సిరియాలో 8 వేల మంది చనిపోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. 4 లక్షల మందికి ప్రపంచ ఆరోగ్య సంస్థ వైద్య సాయం అందించింది. అమెరికాలో చైనా గూఢచారి బెలూన్ (స్పై బెలూన్) కలకలం రేపింది.

ఇది పూర్తిగా అమెరికా ఇంటర్నెట్ సహకారంతోనే జరిగిందని తేలడం మరో సంచలనం. దీన్ని అమెరికా సీరియస్‌గా పరిగణిస్తోంది. జులై 18వ తేదీన 'టైటాన్' అనే జలాంతర్గామి కెనడా న్యూఫౌండ్‌ల్యాండ్ తీర ప్రాంతంలోని ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో గల్లంతయింది. ఆ తర్వాత టైటానిక్ తరహాలో 500 మీటర్ల లోతులో దాని శిథిలాలను గుర్తించారు.

భూసర్వేలో అవకతవకలు

(మొదటిపేజీ తరువాయి)

రక్షా పథకం''లో భాగంగా చేపట్టిన సర్వేలో ఏర్పడిన తప్పుతడకతో వివాదాస్పదంగా ఉన్నందున ఈ సర్వే ప్రక్రియను నిలుపుదల చేసి, తిరిగి సమగ్ర సర్వే ఖచ్చితమైన సాంకేతిక పరికరాలను వినియోగించి చేపట్టాలని, అదే విధంగా ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పాస్‌పుస్తకాలను రద్దు చేయాలని ఎన్. రంగనాయుడు అధ్యక్షతన జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. రైతులను సమీకరించి జనవరి 4వ తేదీన అన్ని గ్రామ సచివాలయ కార్యాలయాల వద్ద పాస్ పుస్తకాల ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేయవలసిందిగా సీపీఐ పిలుపునిచ్చింది.

అంగన్‌వాడీల కలెక్టరేట్‌ల ముట్టడికి సీపీఐ మద్దతు:

రాష్ట్ర వ్యాప్తంగా గత 19 రోజులుగా అంగన్‌వాడీ కార్మికుల నిరవధిక సమ్మె జయప్రదంగా జరుగుతున్నది. 56 వేల సెంటర్లలో లక్షా ఆరు వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్నారు. సమ్మె విచ్ఛిన్నానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం ఖండించింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు కృషిచేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అంగన్‌వాడీ యూనియన్లు జనవరి 3వ తేదీన 26 జిల్లాల కలెక్టరేట్‌ల ముట్టడికి ఇచ్చిన పిలుపునకు సీపీఐ పూర్తి మద్దతు తెలిపింది.

అమరావతి రాజధాని రైతులకు జనవరి 5లోపు కౌలు చెల్లించాలి:

అమరావతి రాజధాని రైతులకు ఇవ్వవలసిన వార్షిక కౌలు నేటివరకు ఇవ్వకపోవడం అత్యంత దారుణమని సీపీఐ కార్యవర్గం పేర్కొంది. మే మొదటివారంలో అందించే కౌలు 8 మాసాలు గడచినప్పటికీ ఇవ్వకుండా కాలయాపన చేయడమంటే అమరావతి రైతులపై రాష్ట్ర ప్రభుత్వ కక్షపూరితమైన వైఖరి తప్ప మరొకటి కాదని తెలిపింది.

జనవరి 15 సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో 5వ తేదీలోపు అమరావతి రైతులందరికీ కౌలు చెల్లించాలని, లేనియెడల జనవరి 8వ తేదీన సీఆర్‌డీఏ కార్యాలయ ముట్టడి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది.

దారి మళ్లించిన నిధులను పంచాయతీలకే జమచేయాలి:

గ్రామ పంచాయితీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను గ్రామ పంచాయితీల తీర్మానం లేకుండా ఏకపక్షంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.8,600 కోట్లు దారి మళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ, ఆ నిధులను వెంటనే గ్రామ పంచాయితీలకే జమ చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. నిధుల దారి మళ్లించడంపట్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలి. కేంద్ర ప్రభుత్వం నిధులను గ్రామ పంచాయితీలకే మంజూరు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు నిధులు కేటాయించి అభివృద్ధికి కృషిచేయాలని సీపీఐ కోరింది.

బైజూస్ ఒప్పందాన్ని రద్దుచేయాలి:

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నది. విద్యార్థులు బైజూస్ యాప్ నందు తరగతులు వినడానికి తరగతిని, సబ్జెక్టుని బట్టి ఫీజులను ప్రభుత్వం నిర్ణయించింది. బైజూస్ యాప్ సంస్థ బజాజ్ ఫైనాన్స్ సంస్థతో ఒప్పందం చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు లోన్లు మంజూరు చేసింది. ప్రతి విద్యార్థి తరగతులు వినడానికి సుమారు రూ.30 వేల నుండి రూ.60 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. విద్యార్థికి తరగతులు అర్థంకాక అర్థాంతరంగా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. బజాజ్ ఫైనాన్స్ సంస్థ వారు చేసుకున్న ఒప్పందం ప్రకారం తరగతులు విన్నా, వినకపోయినా ప్రతినెలా తల్లిదండ్రుల అకౌంట్ నుండి డబ్బులను కట్ చేసుకుంటున్నారు. దీనిపై బైజూస్ ప్రతినిధులను అడిగినా ఏమాత్రం సమాధానం చెప్పడంలేదు. రాష్ట్రంలో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరి నుండి రూ.9 వేల కోట్ల వరకు బైజూస్ సంస్థ వసూలు చేసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌ల కొనుగోలు పేరుతో ప్రతిఏటా రూ.3,500 కోట్లు ఖర్చు చేస్తున్నది. బైజూస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్, వీఆర్వో, వీఆర్‌ఏ, వాలంటీర్లు తదితర రంగాల వారు చేపట్టిన ఆందోళనలకు, సమ్మెలకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గం సంపూర్ణ మద్దతు తెలిపింది.

పచ్చిమిర్చి కనుమరుగు

కూలీలు, వ్యాపారులకు ఇబ్బందులు

ఊహించని పరిణామం: రైతులు

విశాలాంధ్ర-లింగపాలెం: దేశ విదేశాలలో అత్యధిక డిమాండు ఉన్న పచ్చిమిర్చి సాగును ఈ ఏడాది పూర్తిగా నిలిపివేశారు. పచ్చిమిర్చికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం మండల కేంద్రం ప్రసిద్ధి. బీడు భూములను సాగు భూములుగా మలచుకుని ఈ ప్రాంతంలో 60 ఏళ్ల క్రితం పచ్చిమిర్చి సాగు మొదలుపెట్టారు. పదెకరాల నుంచి ప్రారంభమైన పచ్చిమిర్చి విస్తీర్ణం వేల ఎకరాలకు చేరింది. రబీ సీజనులో పండించే ఈ పంటకు అధిక డిమాండు పెరిగింది. ఈ ప్రాంతంలో పండించిన పచ్చిమిర్చి నాణ్యమైనది కావడంతో దేశంలోని అనేక ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. అంతేకాక ఇక్కడ పండిన పంటను అరబ్బు దేశాలకు విమానాల ద్వారా ఎగుమతి చేసేవారు. దీంతో మిర్చి పంట విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. వేలు, లక్షల నుంచి కోట్ల రూపాయలకు మిర్చి వ్యాపారం పెరిగింది. మిర్చి సీజను వచ్చిందంటే కాయలు కోసే కూలీలకు, ముఠా కూలీలకు, లారీలకు డిమాండు ఉండేది. నవంబర్ నుంచి మొదలైన మిర్చి సీజను ఏప్రిల్ వరకు సాగుతూ వచ్చేది. మిర్చి పంట ఆధారంతో అనేకమంది రైతులు ఆర్థికంగా స్థిరపడ్డారు. వ్యాపారులు పెద్దమొత్తంలో సొమ్ము చేసుకునేవారు. ఆరు నెలలపాటు కూలీలు మరో పనికి వెళ్లే అవసరం ఉండేదికాదు. రోజువారీగా చూస్తే లక్షల్లో డబ్బులు చేతులు మారుతుండేవి. ఈ ప్రాంతంలో పండిన పచ్చిమిర్చిని గుజరాత్, ముంబై, కర్నాటక, ఢిల్లీ, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. నెలకు దాదాపు 700 లారీల మిర్చి ఎగుమతి అయ్యేది. వేల మంది కూలీలకు ప్రతీరోజు పని ఉండేది. లింగపాలెం మండల కేంద్రంగా రూ.150 కోట్ల మేర వ్యాపారం జరిగేది. 60 ఏళ్ల నుంచి ఈ పంటపై ఆధారపడిన రైతులు ఒక్కసారిగా పచ్చిమిర్చి పండించటం నిలిపివేశారు. పచ్చిమిర్చికి ప్రత్యామ్నాయంగా ఎండిమిర్చి పండించటం మొదలుపెట్టారు. ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలు పచ్చిమిర్చి కోసం వేరే ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తుంది.

ప్రతికూల పరిస్థితుల వల్ల పండించలేకపోతున్నాం

పచ్చిమిర్చికి గిట్టుబాటు ధర లేకపోవటం, అధికంగా తెగుళ్లు సోకటం, పెట్టుబడులు అధికమవుతుండటంతో మిర్చి పండించే రైతన్నలు నష్టాలబారిన పడుతున్నారు. కొందరు రైతులు నష్టాల నుంచి కోలుకోవటానికి తమ భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో తగిన ప్రోత్సాహం లేకపోవటంతో పచ్చిమిర్చి పండించలేకపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని అంటున్నారు. పచ్చిమిర్చి పంటతోనే ఆర్థికంగా నిలదొక్కుకున్నామని, ఇప్పుడు దీనిని పండించలేకపోతున్నామని రైతులు తెలిపారు. తాము ఏ ప్రాంతాలకు ఎగుమతి చేసేవాళ్లమో ఆ ప్రాంతంలోనే పచ్చిమిర్చి పండిస్తున్నామని, ఇది కూడా తమకు ప్రతికూలంగా మారిందని అంటున్నారు.

ఈ ప్రాంతంలో పండించే పచ్చిమిర్చికి ఇప్పటికీ డిమాండు ఉందని, ఇక్కడ నాణ్యమైన మిర్చి పండుతుందని, వీటి కోసం వినియోగదారులు ఎగబడతారని, ఇప్పుడు కూడా ఈ ప్రాంతంలో పచ్చిమిర్చి కోసం ఎదురు చూస్తున్నారని రైతులు తెలిపారు. పచ్చిమిర్చి పండించే మంచి రోజులు రావాలనే ఆశతో ఎదురుచూస్తున్నామని అంటున్నారు.

సర్వం సర్వేలే!

(మొదటిపేజీ తరువాయి)

దాదాపుగా వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కనున్నాయి. ఇటీవల ముగిసిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సమయంలో రోజుకో సర్వేను రప్పించుకుని, ఆయా పార్టీలు ముందుకుపోయిన పరిస్థితులున్నాయి. అక్కడి ఎన్నికలు పూర్తయిన తర్వాత అనేక సంస్థలు కాంగ్రెస్ గెలుస్తుందని, మరికొన్ని బీఆర్‌ఎస్‌కు తిరిగి ప్రజలు పట్టం కడతారని వెల్లడించాయి. తెలంగాణ ఎన్నికలు పూర్తవడంతో, ఇక ఏపీలో సర్వేల వంతు ప్రారంభమైంది. ఇప్పటికే ఏపీకి సంబంధించి జాతీయ మీడియా సంస్థలు, సర్వే సంస్థలు దేశ వ్యాప్తంగా సర్వేలు నిర్వహించాయి. అదే సమయంలో రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల స్థితిగతులపైనా విశ్లేషించాయి. లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీకి 24 నుంచి 25 స్థానాలు లభిస్తాయని ప్రచారం చేశాయి. అవన్నీ వైసీపీ పెట్టుబడిదారీ సంస్థలుగా ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

పుట్టుకొస్తున్న సర్వే ఏజెన్సీలు

ఏపీలో ఎన్నికలకు గడువు దగ్గర పడటతో పుట్టగొడుగుల్లా అనేక సంస్థలు పుట్టుకొస్తున్నాయి. జన్మత్ పేరుతో ఒక సర్వే సంస్థ ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాల రాజకీయ స్థితిగతులపై వెల్లడిస్తుంది. అది ఇటీవల వెల్లడించిన వివరాల ఆధారంగా వైసీపీ మళ్లీ అధికారం వస్తుందని ప్రకటించగా... దానిని ప్రతిపక్ష టీడీపీ, జనసేన నేతలు తిప్పికొడుతున్నారు. తెలంగాణ ఎన్నికల్లోనూ ఈ సర్వే సంస్థ తన నివేదికను వెల్లడించింది. తాజాగా చాణక్య స్ట్రాటజీస్ తన సర్వే నివేదికలో టీడీపీ-జనసేన కూటమి అధికారం చేజిక్కించుకుంటుందని తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తోంది. ఇటీవల ఆత్మసాక్షి అనే సర్వే సంస్థ కూడా టీడీపీ అధికారంలోకి రాబోతున్నట్లు వెల్లడించిన విషయం విదితమే. ఆయా సర్వేల అనుకూల నివేదికలతో వైసీపీ, టీడీపీ పోటాపోటీగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నాయి. తాజాగా ప్రశాంత్ కిశోర్(పీకే)ను టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గరకు పిలిపించుకున్న విషయం విదితమే. చంద్రబాబు, పీకే మధ్య జరిగిన చర్చల సారాంశం బయటకు రాలేదు. అప్పటి నుంచి టీడీపీకి అనుకూలంగా పీకే వ్యవహరిస్తున్నారన్న ప్రచారముంది. దీనిపై ఎవరూ బహిరంగంగా ధ్రువీకరించలేదు. అటు వైసీపీ నాయకులు మాత్రం తాము వాడుకుని వదిలేసిన పీకేను టీడీపీ చేరదీసిందంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఎన్నికల వరకు ఈ సర్వేల వ్యవహారం కొనసాగే అవకాశముంది. ప్రతి వారం ఈ సర్వేలతో సదరు సంస్థలు తమ నివేదికలను వెల్లడించనున్నాయి. సర్వేలతో ఫలితాలు పూర్తిగా తిరగబడతాయనే అంచనాలు లేకపోయినప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు మాత్రమే వాటి ఆధారంగానే రాజకీయ కార్యకలాపాల్ని కొనసాగిస్తున్నాయి.

రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ సీట్లను సర్వేలు, సామాజిక సమీకరణల ఆధారంగానే టికెట్ల కేటాయింపు జరుగుతోంది. ఇప్పటికే వైసీపీ, టీడీపీలు సొంతంగా సర్వేలునిర్వహించుకుని ముందుకు పోతున్నాయి. టికెట్ల కేటాయింపులు, సమీక్షలపై వైసీపీ కాస్త ముందంజలో ఉంది. టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కిరాలేదు. టీడీపీ, జనసేనతో బీజేపీ కూడా కలిస్తే... ఆ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు మరింత జాప్యం కావచ్చు. బీజేపీతో పొత్తును టీడీపీ శ్రేణులు ఆహ్వానించడం లేదు. చంద్రబాబు అరెస్టు అనంతరం కేంద్రంలోని బీజేపీపై టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ కీలక నేతలకు తెలిసే చంద్రబాబు అరెస్టు జరిగిందని మండిపడుతున్నారు. ఈ సమయంలో బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే ఇండియా కూటమి పార్టీలతోనైనా ఆయన పొత్తు పెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఇందులో భాగంగానే ఇటీవల బెంగళూరు ఎయిర్‌పోర్టులో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, చంద్రబాబు మధ్య స్వల్ప చర్చలు జరిగినట్లుగా ప్రచారముంది. బీజేపీతో టీడీపీ జతకడితే మైనార్టీల ఓటు బ్యాంకు దూరమయ్యే ప్రమాదముందని ఇప్పటికే వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని బీజేపీతో పొత్తుపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఏపీ విభజన అనంతరం రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం నిర్వాసితులకు పరిహారం తదితర హామీలను అమలు చేయలేకపోయింది. దీంతో బీజేపీ, దానితో జతకట్టే పార్టీలపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొంది. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు. గతంలో అనేక సర్వే సంస్థలు ఇచ్చిన నివేదికలు సైతం తిరగబడిన సంఘటనలున్నాయి దీంతో రాజకీయ పార్టీలు సంస్థల సర్వే నివేదికలతోపాటు అన్ని కోణాల్లో ఆలోచించి టికెట్ల కేటాయింపునకు సిద్ధమయ్యాయి.

మోదీ జిమ్మిక్కు!

ప్రచార వేదికలుగా రైల్వే స్టేషన్లు

న్యూఢిల్లీ : ప్రజల భద్రత పట్టించుకోని పాలకులు ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దేశంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కేంద్రంలోని కాషాయ పార్టీ నరేంద్ర మోదీతో జిమ్మిక్కులు చేయిస్తోంది. అధికారమే పరమావధిగా, లౌకికతత్వానికి తూట్లు పొడుస్తూ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ మతోన్మాద వైఖరితో బీజేపీ సర్కార్ పాలన సాగిస్తోంది. ఇది ఎంతో కాలం సాగదని అర్థం చేసుకున్న కాషాయ పార్టీ మోదీతో ప్రచార్భాటం నిర్వహిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచనతో ప్రచారానికి అన్ని వేదికలను వాడుకుంటోంది. ఇప్పుడు ప్రచార వేదికలుగా రైల్వే స్టేషన్లు మారాయి. ప్రజల సొమ్ముతో సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేసి ప్రధాని మోదీ నిలువెత్తు చిత్రాలను ప్రదర్శిస్తోంది. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులతోనే ప్రభుత్వాలు నడుస్తాయి. అయితే ఈ సొమ్ముకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన పాలకులు దానిని పూర్తిగా విస్మరించి తమ స్వీయ ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నారు. ఇందుకు భారతీయ రైల్వేలను వేదికగా చేసుకున్నారు. వివరాలను పరిశీలిస్తే... భారతీయ రైల్వేలో 19 జోన్లు ఉన్నాయి. వాటిలో సెంట్రల్ రైల్వే ఒకటి. దాని కేంద్ర కార్యాలయం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్‌లో ఉంది. ఒక్క సెంట్రల్ రైల్వే పరిధిలోని స్టేషన్ల ప్లాట్‌ఫారాల పైనే 20 శాశ్వత సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేశారు.

కొత్త ఆశల పల్లకి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : నూతన సంవత్సరం 2024కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి భవిష్యత్‌పై కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఏడాది మొత్తం ఉత్సాహం నింపేలా, ఒక మధుర స్మృతిగా మిగిలిపోయేలా వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు నిమగ్నమయ్యారు. పల్లె నుంచి నగరం వరకు అంతా పండుగ చేసుకున్నారు. కొత్త సంవత్సర ఆరంభం ఈ విడత ఆదివారం రావడంతో ఉద్యోగులూ కుటుంబ సమేతంగా ఉత్సాహంగా గడిపారు. కొత్త ఏడాది ఆరంభంకాగానే బాణసంచా పేల్చి ఆనందించారు. ప్రత్యేకించి యువత ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనలు చేస్తూ, ఆనందతో కేరింతలు కొడుతూ హంగామా సృష్టించారు. పట్టణాలు, పల్లెల్లో యువత బృందాల వారీగా డీజీ సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి సంగీత కార్యక్రమాలతో చిందులు వేశారు. మరికొంత మంది ఉమ్మడిగా గెస్ట్‌హౌస్‌లు, రిసార్ట్‌ల వద్దకు వెళ్లి వేడుకలను నిర్వహిస్తున్నారు. విజయవాడలోని పేరొందిన స్టార్ హోటళ్లు, క్లబ్‌లు ఈ వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. బార్లు, సినిమా థియేటర్లు రద్దీగా కనిపించాయి. స్వీట్ షాప్‌ల దగ్గర హడావుడి నెలకొంది. విజయవాడలోని బీసెంట్‌రోడ్ దుకాణాల సముదాయానికి పెద్ద ఎత్తున ప్రజల తరలివచ్చి నూతన దుస్తులను కొనుగోలు చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అన్ని క్రైస్తవ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం సాయంత్రం నుంచి అర్థరాత్రి వరకు క్రైస్తవ బోధకులు ప్రార్థనలు నిర్వహించి, నూతన సంవత్సరాన్ని స్వాగతించారు.

ప్రత్యేక నిఘా పెట్టి... తనిఖీలు చేసిన పోలీసులు

నూతన సంవత్సర వేడుకలపై ఏపీ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి... తనిఖీలు చేశారు. తెలంగాణలో డ్రగ్ కేసుల ప్రభావంతో ముందస్తుగా విశాఖ, విజయవాడలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. రాష్ట్ర శాంతిభద్రతలపై డీజీపీ అన్ని జిల్లాల ఎస్పీలకు, కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయడంతో కఠిన చర్యలు చేపట్టారు. విశాఖ ఆర్కే బీచ్‌లో అర్థరాత్రి నుంచి వాహనాల రాకపోకలను నిషేధించారు. అక్కడి తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పైన వాహనాలను నియంత్రించారు. భారీ వేగంతో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. అర్థరాత్రి ఒంటిగంటలోపే వేడుకలను నిర్వహించేలా, అలాగే బార్ల నిర్వహణపై ఆంక్షలు విధించారు. డ్రగ్స్ వినియోగించిన వారిని గుర్తించేందుకు అప్పటికప్పుడు పరీక్షల నిర్వహించేలా సాంకేతిక పరికరాలతో పోలీసులు సిద్ధమయ్యారు. అరకులోని పాడేరులో నూతన సంవత్సర వేడుకలను వైభవంగా నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతమంతా పర్యాటకులతో సందడిగా మారింది. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, రవాణా చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకునేందుకు ఎక్కడికక్కడా తనిఖీలు చేశారు. తెలంగాణ నుంచి ఏపీకి తరలివస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా నేతృత్వంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. విజయవాడ బందరురోడ్డు, ఏలూరు రోడ్డు, ఫ్లైఓవర్లు, అవుటర్ రింగ్‌రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రోడ్లపైన కేక్ కటింగ్‌లు చేసేందుకు అనుమతి నిరాకరించారు.

ఉద్దానం ఉసూరు!

(మొదటిపేజీ తరువాయి)

పట్టారు. తమ ఇంటి పెద్దలను, వృద్ధులను వదిలి వెళ్లలేని ఉద్వేగభరిత వాతావరణంలో ఉపాధి కోసం సుదూరు ప్రాంతాలకు వలసలు తరలిపోతున్నారు. ఉద్దాన ప్రాంతంలో ప్రజల జీవనం దుర్భరంగా ఉంది. సెంటు భూమి లేకపోయినా ఉద్దానంలో మహారాజులా బతకవచ్చు అనేవారు పూర్వీకులు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉద్దానంలో ముఖ్యంగా కొబ్బరి, జీడితోటలకు పెట్టిందిపేరు. కొబ్బరి 40 వేల ఎకరాలు, జీడి 64 వేల ఎకరాలు, మామిడి, పనస 20 వేల ఎకరాలు సాగులోకి ఉంది. కొబ్బరిపై ఆధారపడి సుమారు లక్షన్నర మందికి పైగా జీవిస్తున్నారు. పరోక్షంగా మరో లక్షమందికి పైగా ఆధారపడి ఉన్నారు. అయితే, పంటలకు, తోటలకు చీడపీడలు సోకడంతో పాటు వరుస తుపానులతో ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక వడ్డీలు కట్టలేక బతుకు భారమై, జీవనోపాధి కరువై ఇక్కడ ప్రజలు వలస బాట పట్టక తప్పడం లేదు. ఇక్కడ ఉండి వ్యవసాయానికి పెట్టుబడి పెట్టే కంటే బయటి కూలి చేసుకోవడం మేలంటున్నారు ఇక్కడి రైతులు. వ్యవసాయం భారమే ఇందుకు కారణం కాదని, చేసుకోవడానికి పనిలేకపోవడం కూడా ముఖ్య కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కపాసుకుద్ది, కవిటి, జగతి, బెజ్జి పుట్టుగ, కుసుంపురం, బల్లి పుట్టుగ, ఉద్దానం ప్రాంతంలో చాలా గ్రామాల్లో ప్రజలు వలస వెళ్లారు. సుమారు 3 వేలు జనాభా గల బల్లిపుట్టుగ గ్రామంలో పెద్దగా జనసంచారం కనిపించడం లేదు. జీవనోపాధికి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం వలస వెళ్లారు. మరికొందరు ఊరు వదిలి వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారు. సుమారుగా ఏటా ఎనిమిది శాతం నుంచి 10 శాతం వరకు వలసలు పోతుంటారు. అక్కడ హోటళ్లు, సామిల్, భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ కొంత మొత్తం డబ్బు మిగిల్చి సొంత ఊరిలో ఉండే కుటుంబ సభ్యులకు డబ్బులు పంపి జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా ఉపాధి చూపడంలో పాలకులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా ఉపాధి చూపితే వచ్చిన దానితో సర్దుకుని కుటుంబాలతో బతికేవారమని ఉద్దానం ప్రజలు వాపోతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను గ్రామాల్లో వదిలి వలసలు వెళ్లాలంటే బాధగా ఉన్నా వెళ్లక తప్పని పరిస్థితి అని ఈ ప్రాంత యువత ఆవేదన చెందుతున్నారు.

వలసలే మంచిదనిపిస్తోంది

- బార్ల ప్రదీప్, బల్లిపుట్టుగ

ఉన్న భూమిని. కుటుంబ సభ్యులను వదులుకోలేక... కన్నతల్లి వృద్ధాప్యంలో ఉన్నందున తల్లికి తోడుగా ఏదో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యువతకు ఉపాధి లేక స్థానికులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. నేను కూడా పని కోసం వలస వెళితే బాగుండనిపిస్తోంది.

రైతుల బతుకులు దారుణం

- బార్ల చినబాబు, రైతు, బల్లి పుట్టుగ

అకాల వర్షాలు, తుపానులు, పంటలకు చీడపీడలతో రైతుల బతుకులు రైతు కూలీల కంటే దారుణంగా ఉన్నాయి. రైతులకు ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. వ్యవసాయానికి పెట్టుబడి పెట్టలేక ఉద్దానం ప్రాంతంలో అధికంగా వలసలు పోతున్నారు. గతంలో వ్యవసాయం చేస్తే ఎంతో కొంత మిగిలేది. ప్రస్తుతం పెట్టుబడి కూడా రాని పరిస్థితి.

ఉద్యమాల ఏడాది

- 'విశాఖ ఉక్కు' చరిత్రాత్మక ఉద్యమాలు
- చంద్రబాబు అరెస్టు
- జనసేన-టీడీపీ పొత్తు
- వైసీపీలో టికెట్ల కలకలం
- ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమాలు
- అంగన్‌వాడీ, మున్సిపల్ ఉద్యోగుల సమ్మె బాట

– జీబీ బాబు

ఉద్యమాల సంవత్సరంగా 2023 నిలిచిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉవ్వెత్తున పోరాటాలు కొనసాగాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల నిరసనలు, ఆందోళనలు అధికార వైసీపీని ఏడాదిపాటు కుదిపేశాయి. వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రం నుంచి ఢిల్లీ వరకు రైతు సంఘాలు నిరసన బాట పట్టాయి. ప్రధానంగా వైసీపీ సర్కారు ప్రజా వ్యతిరేక పాలనపై వామపక్షాల ఆందోళనలు, దీక్షలు పతాక స్థాయిలో నిలిచాయి. అన్ని రాజకీయ పార్టీలు సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తమై వ్యూహాలను ఆరంభించాయి. వైసీపీ నుంచి గడప గడపకు మన ఎమ్మెల్యే, సామాజిక సాధికార బస్సు యాత్రలు, జగనన్న ఆరోగ్య రక్ష తదితర కార్యక్రమాలతో ప్రజల ముందుకెళ్లింది. అందులోని లోపాలను విపక్షాలు ఎప్పటికప్పుడూ ఎత్తిచూపుతూ నిరసన తెలిపాయి. మూడు రాజధానులకు వ్యతిరేకంగా అమరావతి రాజధాని రైతుల ఉద్యమం కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా న్యాయ స్థానాల్లో అనేక కీలక తీర్పులు సైతం జగన్ సర్కారుకు ఎదురుదెబ్బలుగా నిలిచాయి. ఉద్యోగుల సమస్యలు, పీఆర్సీ బకాయిలు తదితర సమస్యలపై ఏపీ జేఏసీ అమరావతి 92 రోజులపాటు నిర్వహించిన ఉద్యమంతో సర్కారు దిగివచ్చింది. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం వంటి సంఘటనలు ప్రత్యేకంగా నిలిచాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలపై టీడీపీ, వైసీపీ పోటాపోటీగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదుల పరంపర కొనసాగింది. ఉపాధ్యాయ, పట్టభద్రులకు జరిగిన ఐదు శాసన మండలి ఎన్నికల్లో వైసీపీకి చుక్కెదురైంది. టీడీపీకి మూడు రాగా, వైసీపీ కేవలం రెండు స్థానాలనే దక్కించుకుంది. ఇక విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేసింది.

ఉద్యమాల్లో సీపీఐ కీలక భూమిక

ఈ ఏడాది ఉద్యమాల్లోనూ సీపీఐ, ప్రజాసంఘాలు ప్రధాన భూమిక పోషించాయి. సీఎం జగన్ సర్కారు జారీజేసిన చీకటి జీవోలను నిరసిస్తూ సీపీఐ అధ్వర్యంలో సంక్రాంతి భోగి మంటల్లో జీవో ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆందోళనలు కొనసాగిస్తూ అన్ని ప్రధాన పోస్టల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు జరిగాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్వర్యంలో తుంగభద్ర డ్యామ్ నుంచి సీపీఐ ప్రతినిధి బృందం నీటి ప్రాజెక్టులను పరిశీలించింది. పోలవరం ప్రాజెక్టుతో పాటు చివరగా ఉత్తరాంధ్రలోని సుజల స్రవంతిని బృందం పరిశీలించింది. విశాఖ ఉక్కు పరిరక్షణకు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టారు. బంద్‌లు, రాస్తారోకోలు నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో అన్ని రంగాలలో వైఫల్యాన్ని ఎండగడుతూ సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు చేపట్టింది. రైతు, కార్మిక రంగాల సమస్యల పరిష్కారంలో విఫలమైన జగన్ సర్కారుకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగాయి.

అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్ల సాధన కోసం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్షలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. రాష్ట్రంలో దళిత, మైనార్టీలు, మహిళలు, జర్నలిస్టులు, పిల్లలపై జరుగుతున్న అఘాత్యాలు, దాడులను నిరసిస్తూ సీపీఐ అనేక సార్లు అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించింది. వాటికి కొనసాగింపుగా చేపట్టిన ఆందోళనలతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయింది. ప్రతిపక్షాలపై దాడులు, అరెస్టులపైనా వామపక్షాలు ఉద్యమించాయి. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా

అఖిలపక్షం రౌండ్ టేబుల్ నిర్వహించింది. పోలవరం ముంపు ప్రాంతాల్లో వామపక్షాల నేతల పర్యటనలు, పునరావాస ప్యాకేజీ అంశంపైన ఉద్యమాలతో ఈ ఏడాది కొనసాగింది. అప్పులమయమైన రాష్ట్ర పరిస్థితిపై అడుగడుగునా వామపక్షాలు దుయ్యబట్టాయి.

టిడ్కో, జగనన్న ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల సాధన కోసం సమైక్య పోరాటాలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళనలు నిర్వహించారు.

అంగన్‌వాడీలు, మున్సిపల్ సమ్మె

అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ప్రభుత్వంతో అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. ప్రధానంగా అంగన్‌వాడీల సమ్మె ప్రభావంతో కేంద్రాలన్నీ వెలవెలబోయాయి. చాలా చోట్ల అంగన్‌వాడీల ఉద్యమం అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ, కార్మికులు వెనక్కి తగ్గలేదు. వారి ఉద్యమానికి వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న తరహాగా తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నేతలు ఉద్యమబాట పట్టారు.

యువగళంతో లోకేశ్ పాదయాత్ర

టీడీపీ అధినేత లోకేశ్ యువగళం పాదయాత్రను కుప్పం నుంచి ప్రారంభించారు. ఈ యాత్రలో పాల్గొన్న నందమూరి తారకరత్న ఊపిరాడక మృతి చెందడం నందమూరి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. అక్కడి నుంచి ప్రారంభమైన యాత్రను చంద్రబాబు అరెస్టుతో దాదాపు రెండు నెలలపాటు లోకేశ్ నిలిపేశారు. అనంతరం చంద్రబాబు బెయిల్‌పై వచ్చిన వెంటనే మళ్లీ విశాఖ-విజయనగరం సరిహద్దుల వరకు యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఒకే వేదికపైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉండి, రాబోయే ఎన్నికలపై వ్యూహ రచన చేశారు. యువగళం నిర్వహించిన ప్రతి సభలోనూ ప్రభుత్వానికి చెందిన కొందరు అధికారుల పేర్లను లోకేశ్ రెడ్‌బుక్‌లో నమోదు చేసినట్లు ప్రకటించడం వివాదాస్పదమైంది. ముందస్తుగా ప్రకటించిన విధంగా తన పాదయాత్రను లోకేశ్ అనివార్య కారణాల వల్ల కుదించుకున్నారు.

టీడీపీని కుదిపేసిన చంద్రబాబు అరెస్టు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు వ్యవహారం ఆ పార్టీని కుదిపేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అవినీతి ఆరోపణలపై చంద్రబాబు అరెస్టు అనంతరం దాదాపు రెండు నెలల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉండటంతో కార్యకర్తలు తీవ్ర ఆందోళన చెందారు. చంద్రబాబు కేసులకు విజయవాడ ఏసీబీ కేంద్రంగా నిలిచింది. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో నిత్యం చంద్రబాబు కేసుల విచారణలు, వాదనలు, తీర్పులు వార్తల్లో నిలిచాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పవన్ కల్యాణ్ వెళ్లి చంద్రబాబును పరామర్శించి, అనంతరం టీడీపీతో జనసేన పొత్తును ప్రకటించారు. చంద్రబాబు అరెస్టును జాతీయ, రాష్ట్ర పార్టీల నేతలు ఖండించారు. చంద్రబాబు అరెస్టు అనంతరం ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ప్రజల్లోకి వచ్చారు. నిజం గెలవాలంటూ భువనేశ్వరి కొద్దిరోజులు బస్సు యాత్ర చేశారు.

వైసీపీలో ఇన్‌ఛార్జ్‌ల మార్పిడి సెగ

ఏడాది చివరిలో నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల మార్పిడి నిర్ణయం వైసీపీ అధిష్ఠానానికి పెద్ద షాక్‌గా మారింది. ఈ మార్పుతో సొంత పార్టీ ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగురవేశారు. జగన్‌కు నమ్మినబంటుగా ఉన్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సైతం పార్టీని వీడారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు సాధించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్న వైసీపీకి ఎదురు దెబ్బలు తగిలాయి. టికెట్లు రావనే నేతలంతా ఇతర పార్టీలవైపు దిక్కులు చూస్తున్నారు. దీంతో సీఎం జగన్ ఆచితూచి టికెట్ల జాబితా ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది పొడవునా ప్రభుత్వానికి ఇంటా, బయట నిరసన సెగ ఎదురయ్యింది.

వారాహి యాత్రతో పవన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి రాజకీయ యాత్ర ప్రారంభించారు. పవన్ కల్యాణ్ సామాజిక వర్గానికి పట్టున్న ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, విశాఖ తదితర జిల్లాల్లో వారాహి యాత్రలు నిర్వహించి, జగన్ సర్కారుపై పవన్ ఘాటైన విమర్శలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ రహిత ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. అందుకు బీజేపీ, జనసేనతో పాటు టీడీపీతోనూ జతకడతామని వెల్లడించారు. ఆ దిశగా ఆయన వారాహి యాత్ర కొనసాగింది. మధ్యలో తెలంగాణ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో బీజేపీతో కలసి జనసేన పోటీ చేసి, ఓటమి పాలైంది. మళ్లీ ఏపీ కేంద్రంగా పవన్ కల్యాణ్ వచ్చి కార్యకలాపాలను కొనసాగించారు. విడతల వారీగా కొనసాగిన ఈ యాత్రలతో తన బలం పెంచుకునేందుకు పవన్ ప్రయత్నించారు.

పోరాటాల సంవత్సరం 2024

ఎం. మురళీకృష్ణ

సోమవారం నుంచి ప్రారంభంకానున్న 2024 సంవత్సరం మన దేశంలో పోరాటాల సంవత్సరంకానున్నది. ఈ ఏడాది కార్మిక సంఘాల పోరాటం ఉధృతం కానున్నది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సాగుతున్న వినాశకర, విధ్వంసకర పాలనను వ్యతిరేకిస్తూ ఈ సంవత్సరం మొదటి అర్థభాగంలో సమరశీల పోరాటాల ఉధృతి కనపడనున్నది. ఈ ఏడాది మే నెలాఖరులోగా సార్వత్రిక ఎన్నికలు కూడా ముగియనున్నాయి. కార్మిక సంఘాల నుంచి గట్టి ప్రతిఘటన కారణంగా ఇప్పటివరకు కేంద్రం వాయిదా వేసిన నాలుగు వివాదాస్పద లేబర్ కోడ్‌ల అమలుపై ఎన్నికైన ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సంవత్సరం ద్వితీయార్థంలో ఉద్యమ గమనం ఆధారపడి ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతూ, ఈ ఏడాది ప్రారంభం జనవరి నుంచి తమ నిర్ణయాత్మక నిరసన ఉమ్మడి పోరాట కార్యక్రమాన్ని కొనసాగించాలని 10 కేంద్ర కార్మికసంఘాలు, దేశంలోని వందలాది రైతు సంఘాలకు నేతృత్వం వహిస్తున్న ఎస్‌కేఎం నిర్ణయించాయి. కేంద్రం వినాశకర విధానాలను నిరసిస్తూ పది కేంద్ర కార్మిక సంఘాలు-ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ-తో కూడిన ఉమ్మడి వేదిక, దేశంలోని దాదాపు 500 రైతు సంఘాలతో కూడిన వేదిక ఎస్‌కేఎం 2023లో కూడా ఏడాది అంతా నిర్విరామ పోరాటాలు నిర్వహించాయి. 2023 జనవరి 30న న్యూదిల్లీలో కార్మికుల జాతీయ సదస్సు జరిగింది, ఇందులో అనేక ఇతర స్వతంత్ర సమాఖ్యలు, కార్మికుల సంఘాలు పాల్గొన్నాయి. "సేవ్ ది నేషన్, సేవ్ ది పీపుల్" అనే నినాదంతో కార్మికులు దేశవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది.

జూలై 2023లో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం సంయుక్త సమావేశం, మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్తంగా పోరాడాలని నిర్ణయించింది. ఆగస్టు 24న చారిత్రాత్మక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమయంలో, రైతులు, కార్మికులు - "పీఎం మోదీ - క్విట్ ఇండియా", "బీజేపీ - క్విట్ ఇండియా", 'బీజేపీ హటావో, దేశ్ బచావో" నినాదాలతో పోరాడారు. నవంబర్ 26-28 తేదీలలో దేశవ్యాప్తంగా రాజ్‌భవన్‌ల ముందు నిరసన తెలిపారు. డిసెంబర్ నెలలో అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారం, జనవరి 2024లో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు, ప్రచారం కొనసాగుతుంది.

మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వినాశకర మూడు వ్యవసాయ చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 2020 నుంచి రైతులు, కార్మికులు నిర్వహిస్తున్న సుదీర్ఘ పోరాటానికి ఇది కొనసాగింపు మాత్రమే, 2021, 2022 2023లో కూడా ఈ పోరాటాలు కొనసాగాయి. రైతుల మొక్కవోని పోరాటానికి తలొగ్గిన ప్రధాని నరేంద్ర మోదీ వినాశకర మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని 2021 నవంబర్‌లో ప్రకటించారు. శుష్క వాగ్దానాలతో తమను దగాచేశారని రైతులు భావిస్తున్నారు. అయితే, మోదీ ప్రభుత్వం నాలుగు వివాదాస్పద కార్మిక చట్టాలపై తీవ్రంగా దృష్టి సారించింది, కేంద్ర కార్మిక సంఘాల గట్టి ప్రతిఘటన కారణంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వాటిని అమలుచేయలేకపోయింది. కేంద్రంలో మోదీ తిరిగి అధికారంలోకి వస్తే, 2024 సంవత్సరం ద్వితీయార్థంలో ఈ కోడ్‌లు అమలులోకి తీసుకువచ్చేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తారని భావిస్తున్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కేవలం "ఆర్థిక బానిసలుగా" మారుస్తాయని కేంద్ర కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. అందువల్ల, ఎన్నికల ప్రచార సమయంలో సీటీయూలు, ఎస్‌కేఎం నేతృత్వంలో కార్మికులు, రైతుల ఉద్యమం తీవ్రతరంకానున్నది. ఆర్‌ఎస్‌ఎస్ కార్పొరేట్ పాలనను ప్రతిఘటిద్దామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ సర్వసభ్య సమావేశం పిలుపునిచ్చింది. కనీస మద్దతు ధర, రుణ మాఫీ, విద్యుత్ బిల్లు రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది. అన్ని డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరు ఆగబోదని కేంద్రప్రభుత్వానికి తేల్చిచెప్పింది. వచ్చే నెల 10 నుంచి 20వ తేదీ వరకు జన జాగరణ ప్రచారాన్ని నిర్వహించాలని గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న దేశంలోని 500 జిల్లాల్లో ట్రాకర్ పరేడ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ట్రాక్టర్ పరేడ్‌లో పాల్గొనే రైతులు జాతీయ పతాకాలతో పాటు సంఘాల జెండాలను ప్రదర్శిస్తారని, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం రక్షణకు ప్రతిజ్ఞ చేస్తారని పేర్కొంది. ట్రాక్టర్లతో పాటు మోటార్‌బైకులు, ఇతర వాహనాలు పరేడ్‌లో పాల్గొంటాయని వెల్లడించింది.జన జాగరణ ప్రచారాన్ని 20 రాష్ట్రాల్లోని ఎస్‌కేఎం రాష్ట్ర శాఖలు విస్తృత స్థాయిలో నిర్వహిస్తాయని తెలిపింది. ఇందులో భాగంగా ఇంటింటి ప్రచారంతో పాటు కరపత్రాల పంపిణీ ద్వారా మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ప్రచారం ఉద్దేశమని వెల్లడించింది. రైతు, కార్మికుల వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు తెలియజేస్తామని పేర్కొంది. 30.40కోట్ల కుటుంబాల్లో కనీసం 40శాతాన్ని చేరుకోనేలా లక్ష్యాన్ని నిర్దేశించేలా రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీలు సమావేశమవుతాయని పేర్కొంది. కార్పొరేట్-మతోన్మాద ప్రభుత్వాన్ని ఓడించేందుకు, కుల-మత విభజన ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు జన జాగరణ ప్రచారంతో పాటు ట్రాక్టర్ పరేడ్‌ను విజయవంతం చేయాలని ఎస్‌కేఎం పిలుపునిచ్చింది.

సంఘటిత, అసంఘటిత రంగాలలో కార్మికులను మరింత అనధికారికీకరణ వైపు దేశం వెళుతున్నందున, ట్రేడ్ యూనియన్ ఉద్యమం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. దేశంలో నిరుద్యోగం రేటు చాలా ఎక్కువగా ఉంది. ధరల పెరుగుదల కారణంగా నిజ వేతనాలు క్షీణించాయి. సంఘటిత రంగాలకు కాంట్రాక్టులపై కార్మికులను నియమించుకునే హక్కులు కల్పించబడ్డాయి. అనేక ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్ చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రేడ్ యూనియన్ వాదం గణనీయంగా బలహీనపడింది. వేగంగా మారుతున్న పని ప్రపంచంలో కార్మికుల హక్కులను పరిరక్షించడంలో కార్మిక సంఘాలు పెద్ద సవాళ్లను ఎదుర్కోవడమే కాకుండా తమను తాము పరిరక్షించడంలో కూడా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటోంది. ట్రేడ్ యూనియన్లు వారు కష్టపడి పని చేయాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో సంఘటితంగా ఉండేందుకు అసంఘటిత రంగ కార్మికులలో తమ సభ్యత్వాన్ని విస్తృతం చేసుకోవాలి. ముఖ్యంగా ఎన్నికల సంవత్సరంలో రాజకీయ అనిశ్చితి నెలకొని ఉన్న తరుణంలో కార్మిక శక్తిని, మహత్తర పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను రక్షించుకోవడానికి కార్మికుల మహా కూటమి అత్యంత అవశ్యం. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను పెద్ద ఎత్తున ప్రైవేటీకరించడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలనే మోదీ ప్రభుత్వం దుష్టచర్య ఇప్పటికే శ్రామిక శక్తిని నిరుత్సాహపరిచింది. మోదీ ప్రయత్నాలను అడ్డుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు గత నాలుగేళ్లలో సార్వత్రిక సమ్మెతో సహా వివిధ నిరసన కార్యక్రమాలను చేపట్టాయి. అయినా మోదీ ప్రభుత్వంలో చలనంలేదు. నేడు అత్యధిక కార్మికశక్తి ఎటువంటి సామాజిక భద్రతలేకుండా పనిచేస్తున్న ప్రస్తుత తరుణంలో , ప్రపంచ పని విధానం వేగంగా మారుతున్న నేపథ్యంలో 2024 ఎన్నికలలో ప్రధానమంత్రి మోదీ తిరిగి అధికారంలోకి వస్తారా? లేదా? అనే దానితో సంబంధం లేకుండా కార్మిక సంఘాలు సమరశీల ఉద్యమాలు నిర్వహించాల్సివుంది. అందుకే 2024 పోరాటాల సంవత్సరం.

బతుకు నిప్పకణికపై విశ్వాసం

మూలం: యెవ్గేని వినకూరవ్
అనువాదం: కేశవ్ గోపాల్

నేనీ కవితలు ఒక్క వుదుటున రాయలేదు.
శిశిర శీతల మార్గాల వెంట
బురద గుంటలు దాటుతూ
వాటితో కలిసి
ఒక్కొక్క అడుగూ వేశాను.
రూపుదిద్దుకోని కవితలను
కళ్ళలో దాచుకుని
పొద్దుగూకులూ
పొట్టతో పాకుతూ
పోరాడాను.

ఫిరంగి గుళ్ళ మధ్య
కాలు కదిపినా
నేల విశ్రమించినా
అనుసరించే వున్నాయి.
నా రక్త మాంసాల్లాగే
క్షణమైనా వీడిపోలేదు
అవి నన్ను!

అగచాట్లను అధిగమించి
గుండె రాయి చేసుకొని
పోరి తీరాలని
నాలోని అణువణువూ నింపి
నా గీతాలకు వూపిరి పోశాను!

(ప్రముఖ రష్యన్ కవి. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫిరంగి దళ సైనికుడుగా పనిచేసినప్పుడు యుద్ధ రంగంలో కవితలు రాయడం ప్రారంభించాడు) (ఫిబ్రవరి, 1943)

సాహితి

వ్యధార్థ జీవిత యథార్థ కుసుమం మోహన్ రాకేశ్

అస్తవ్యస్తమైన జీవితం, క్రమశిక్షణారాహిత్యం సాహితీసృజనకు మూలాధారం కాదు కాని ఈ లక్షణాలున్న వారు ఉత్తమ సాహిత్యం సృష్టించిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ప్రసిద్ధ ఇంగ్లీషు రచయిత ఆలివర్ గోల్డ్‌స్మిత్ జీవితం ఎంత అస్తవ్యస్తమైందో హిందీ నాటకరంగాన్ని మలుపు తిప్పిన మోహన్ రాకేశ్ (8.1.1925-3.1.1972)ది కూడా అంతే వ్యధార్థ జీవితం. జీవితంలో క్రమ శిక్షణ లేకపోవడం, నికరంగా ఏ ఉద్యోగమూ చేయలేక పోవడం, డబ్బును లక్ష్యపెట్టకపోవడం, కడకు సాంసారిక జీవితంలోనూ కుదురు లేకపోవడం మోహన్ రాకేశ్ జీవితంలో కొట్టొచ్చేటట్టు కనిపించే అంశాలు. ఈ చాయలు బహుశః రాకేశ్‌కు తన తండ్రి దగ్గరి నుంచి అబ్బినట్టున్నాయి. ఆయన తండ్రి కరంచంద్ గుగ్లానీ బాగా డబ్బు సంపాదించిన న్యాయవాది. కాని ఆయన డబ్బు విషయంలో విచ్చలవిడిగా వ్యవహరించి అప్పులు మిగిల్చి తనువు చాలించారు. అప్పుడు మోహన్ రాకేశ్‌కు పదహారేళ్లుమాత్రమే. అక్కతో కలిసి రాకేశ్‌కుటుంబ భారం మోయాల్సి వచ్చింది. అయినా క్రమశిక్షణ అలవర్చుకోలేదు. అయిదేళ్లకు మించిచేసిన ఉద్యోగం ఒక్కటికూడా లేదు. కొన్ని ఉద్యోగాలు అయితే కొద్దినెలల్లోనే ముగిశాయి. అవన్నీ చిన్నాచితకా ఉద్యోగాలేమీ కావు. బాధ్యతా రహితంగా వ్యవహరిస్తారన్న చెడ్డ పేరు మూటగట్టుకున్నారు.

"నా మిత్రుడు అస్తవ్యస్తంగా ఉండే మాట వాస్తవమే అయినా ఆయనలో అంతర్నిహితమైన ఓ క్రమశిక్షణ ఉండేది. ఆ క్రమశిక్షణ మేధస్సులో, సృజనాత్మకతలో ద్యోతకమవుతుంది" అని ఆయన సహచరుడు, ప్రసిద్ధ రచయిత కమలేశ్వర్ ముక్తాయించారు. ఉద్యోగాలు చేసినన్నాళ్లు మోహన్ రాకేశ్‌కు ఎప్పుడు వదిలేద్దామా అన్న ధ్యాసే ఎక్కువ. దీనికి ప్రధానకారణం బతుకుకు భరోసా ఉండడం కాదు. పూర్తి సమయాన్ని సాహిత్య సృజనకు కేటాయించాలన్న తీవ్రమైన కోరికే ప్రధానకారణం. తరచుగా ఇల్లు వదిలేసి సుదూర ప్రాంతాలైన డల్‌హౌసీ, శ్రీనగర్ లాంటి చోట్ల రహదారి బంగళాల్లో మకాం పెట్టేవాడు. ఒంటరిగా గడిపేవాడు. కాని ఆయన ఎంచుకున్న ఈ ఒంటరితనమే హిందీ సాహిత్యరంగాన్ని పరిపుష్టం చేసింది.

మోహన్ రాకేశ్ అసలుపేరు మదన్ మోహన్ గుగ్లానీ. అమృత్సర్‌లో జన్మించారు. కాని ఉన్నత విద్యాభ్యాసం లాహెూర్‌లో జరిగింది. 1947లో దేశవిభజన తర్వాత హిందీసినిమా రంగంలో ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ ముంబై వెళ్లి అక్కడా ఇమడలేక చివరకు దిల్లీ చేరుకున్నారు. ఆయన తండ్రి అమృత్సర్ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో పేరున్న వ్యక్తి. సామాజిక కార్యకర్త. సాహిత్య, సంగీత ప్రేమికుడు. మోహన్ రాకేశ్ అమృత్సర్‌లో విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత లాహెూర్ లోని పంజాబ్ యూనివర్సిటీలో ఇంగ్లీషు ఎం.ఏ. పట్టా సంపాదించారు. ఆ తర్వాత జలంధర్ వచ్చి హిందీ ఎం.ఏ. లో యూనివర్సిటీలోనే ప్రప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన నాయనమ్మకు మూఢనమ్మకాలు ఎంత ఎక్కువో క్రమశిక్షణ అంతే మక్కువ. ఈ రెండూ రాకేశ్‌కు పడేవికాదు. దానివల్లే తిరుగుబాటు తత్వం అలవడింది.

ఎం.ఏ. పూర్తి అయిన తర్వాత ముంబైలో 1947 నుంచి 1949 దాకా ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. కంటి చూపు బాగా లేదన్న కారణంగా ఆ ఉద్యోగం నికరం కాలేదు. ఆ తర్వాత కొంతకాలం దిల్లీలో నిరుద్యోగం అనుభవించి జలంధర్‌లో బోధనావృత్తిలో ఉన్నారు. ఆ కళాశాలలో రాజకీయాల కారణంగా ఉద్యోగం ఊడితే దిల్లీలో మళ్లీ అధ్యాపకుడిగా కొంతకాలం పని చేశారు. మళ్లీ జలంధర్‌లో అధ్యాపక వృత్తిలో కొనసాగి పూర్తికాలం రచనా వ్యాసంగం కొనసాగించడానికి ఉద్యోగానికి స్వస్తి చెప్పారు.

మోహన్ రాకేశ్ కథ, నాటకం, వ్యాస రచన, యాత్రా స్మృతి వంటి అనేక ప్రక్రియలలో తన ప్రతిభ నిరూపించుకున్నారు. కాని హిందీ సాహిత్య లోకం ఆయనను నాటక రచయితగానే గుర్తుంచుకుంటుంది.

మానవ సంబంధాలలో ఉన్న బాధను, సంవేదనలను చిత్రించడంలో చేయితిరిగిన రాకేశ్ వ్యక్తి గత జీవితంలో ఉన్నత ఆదర్శాలు, మహోన్నత ఆశయాలు, సంవేదనలుఉన్నా చుట్టు ఉన్న మనుషుల అంతరంగం తెలుసు కోవడంలో చాలా అమాయకంగా వ్యవహరించారు. 1950లో పెళ్లి చేసుకున్నాడు. అందులో ఎక్కువ భాగం భార్య ఒకచోట ఉంటే ఆయన ఇంకొకచోట ఉండేవారు. ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నట్టు లోకానికి అనిపించినా వారిద్దరి మధ్య ఏ మాత్రం పొసగలేదు. చివరకు విడాకులు తీసుకున్నారు. 1960లో రెండోసారి పెళ్లిచేసుకుంటే అది కొద్దినెలలకే పరిమితమైంది. 1963లో తన భావాలతో సామ్యం కుదిరిన అనితతో సహజీవనం చేశారు. 47వ ఏట మోహన్ రాకేశ్ మరణించే దాకా వారిద్దరి జీవితం సవ్యంగానే సాగింది. "నాజీవితంలో మొదటిస్థానం నా సాహిత్యానికి, రెండో స్థానం నా స్నేహితులకు, నీకున్నది మూడోస్థానంమాత్రమే" అని అనితకు నిర్మోహమాటంగా చెప్పగలిగినవ్యక్తిత్వం మోహన్ రాకేశ్‌ది.

ఎం.ఏ. పూర్తి అయిన తర్వాత ఆయన మూడున్నరేళ్ల పాటు ఏ పనీ చేయకుండానే ఉండిపోయారు. ఉద్యోగం దొరకక ముంబై నుంచి తిరుగు ప్రయాణానికి సిద్ధమైన దశలో సిద్నేహం కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా 75 రూపాయల ఉద్యోగం దొరికింది. అంతకు ముందు 72గంటలపాటు ఆకలికి గురికాక తప్పలేదు. ఆ తర్వాత ఆ ఉద్యోగం ఖాయం అయింది. ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అక్కడా రెండేళ్ల పాటే పనిచేశారు. ఆ తర్వాత స్వయం ఉపాధి వెతుక్కోవడం కోసం అనువాదాలు చేయడానికి ఓ సంస్థను ప్రారంభించినా ఆ ప్రయత్నమూ ఫలించలేదు. చివరకు జేబులో ఉన్న వంద రూపాయలతో దిల్లీ చేరుకున్నారు. సారిక పత్రికలో కథలు రాస్తే తృణమో పణమో వచ్చేది. తర్వాత ఆ పత్రిక సంపాదకుడిగా చేరిపోయినా నాలుగుగోడల మధ్య కూర్చుని పనిచేయడం నచ్చక మానేశారు. అక్కడి నుంచి డి.ఏ.వి. కళాశాలలో హిందీ లెక్చరరుగా నియమితులయ్యారు. అదీ ఎక్కువ కాలం నిలవలేదు. సింలాలో బిషప్ కాటన్ పాఠశాలలో ఐడిపంతులుగా చేరిపోయారు. అక్కడ పనిచేసింది రెండేళ్లే. అప్పటికే ఆయన కథా సంకలనం వెలువడినందువల్ల రచనల మీదే బతకాలనుకున్నారు. రెండున్నరేళ్ల తర్వాత రెండుసార్లు రాజీనామాచేసినా హెడ్ మాస్టర్ బలవంతం మీద కొనసాగాల్సి వచ్చింది. చివరకు 1952లో రాజీనామాచేశారు. ఆ తర్వాత ఎనిమిదినెలలు ఖాళీగా ఉన్న సమయంలో ఆఖ్రీచట్టాన్ రాశారు. అది అచ్చయింది కాని ప్రచురణకర్తల దగ్గరి నుంచి డబ్బు రాబట్టడం ఎంత కష్టమో అర్థం అయింది. అంతకు రెండున్నరేళ్ల ముందే 1950లో పెళ్లి అయింది. భార్య ఉద్యోగం చేస్తున్నారు కనక తాను ఉద్యోగం మానేసినా పరవాలేదనుకున్నారు. ఆమె ఆగ్రాలో పనిచేసేవారు. రాకేశ్ అమృత్సర్‌లో ఉండే వారు. మళ్లీ జలంధర్ లోని డి.ఏ.వి. కళాశాలలో హిందీ విభాగం అధిపతిగా ఉద్యోగంలో చేరిపోయారు. అక్కడ దాదాపు నాలుగున్నరేళ్లు పని చేశారు. అంతకాలం ఒకేచోట పనిచేయడం అదే మొదటిసారి. ఆఖరుసారి. 1957లో అదీ వదిలేశారు. 1957లో మొదటి భార్యకు విడాకులిచ్చారు. 58 నుంచి 61 దాకా ఏ ఉద్యోగం లేకుండానో గడిపారు. భార్య ఆగ్రాలో తను అమృత్సర్‌లో ఉంటూనే వివాహ బంధం కొనసాగిందనిపించారు. కాని వారి మధ్య పొసిగేది కాదు. చివరకు విడాకులు తీసుకున్నారు.

సారికలో ఉద్యోగం వదిలేసిన తర్వాత రెండేళ్లపాటు అటూ ఇటూ తిరుగుతూ కాలక్షేపంచేసిన తర్వాత అనిత రాకేశ్ జీవితంలోకి ప్రవేశించారు. ఆ మధ్యలోనే తన సోదరి స్నేహితురాలిని పెళ్లాడారు. కాని ఒక్కరోజు కూడా సయోధ్య కుదరలేదు.

ఆధే అధూరే నాటకానికి బహుళ ప్రచారం వచ్చింది. ఆ నాటకం హిందీ నాటక రంగంలోనే కాక భారత నాటక రంగ చరిత్రలోనే ఓ మైలురాయి. అది సమగ్రమైన ఆధునిక భారత నాటకం అన్న ప్రశంసలు వచ్చాయి. ఆ నాటకంలో వాడిన భాష సులువైందని, హిందీ నాటకరంగచరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్న అభినందనలు వచ్చాయి. అయితే ఈ నాటకంలో పశ్చిమ దేశాల జీవన విధానాల ప్రభావం ఎక్కువ అన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఒకే వ్యక్తి అయిదు పాత్రలు పోషించడం ఈ నాటకం విశిష్టత. నాటకాలు రాసే వారికి మోహన్ రాకేశ్ స్ఫూర్తిప్రదాత అన్న అభినందనలూ అందాయి. ఈ నాటకం మీద విపరీతమైన చర్చ జరిగింది. పట్టణ ప్రాంతాల మధ్యతరగతి వర్గంలో దిగజారుతున్న విలువలను రాకేశ్ ప్రతిభావంతంగా చిత్రించారు. విమర్శలు ప్రశంసలు ఎన్ని ఉన్నా వాస్తవికతను చిత్రించడంలో ఆధే అధూరే హిందీ నాటక రంగాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చింది. మోహన్ రాకేశ్ బెర్ట్రోల్ బెహ్ట్, స్ట్రిండ్బర్గ్, ఓ నీల్, ఆర్థర్ మిల్లర్ స్థాయివారు అని విమర్శకులు కొనియాడారు. 1968లో మోహన్ రాకేశ్‌కు సంగీత నాటక అకాడమీ అవార్డు వచ్చింది. ఆషాఢ్ కా ఏక్ దివస్ నాటకం రాకేశ్‌ను మొదటి ఆధునిక నాటక రచయితగా నిలబెడితే ఆధే అధూరే ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఆయన నాటకాలు ఇప్పటికీ దేశంలోనే కాక విదేశాల్లో కూడా ప్రదర్శిస్తూనే ఉన్నారు. తాను రాసిన దానికి నిరంతరం మెరుగులు దిద్దడం రాకేశ్ ప్రత్యేకత. బుద్ధుడు సన్యసించడం, దానివల్ల ఆయన కుటుంబంమీద పడిన ప్రభావం ఇతివృత్తంగా రాసిన లెహరోంకె రాజ్ హంస్ నాటకాన్ని 20 ఏళ్ల పాటు మెరుగులు దిద్దారు. చివరకు అది అద్భుత కళాఖండంగా తయారైంది. ఈ నాటకంకోసం పడ్డ శ్రమ, మోహన్ రాకేశ్ డైరీలు, రచనల ఆధారంగా, నాటకం గురించిన లేఖల ఆధారంగా దిల్లీలోని ఒక నాటక సంస్థ మాన్యుస్క్రిప్ట్ అన్న నాటకాన్ని రూపొందించింది. ఒక రచయితకు ఇది అపూర్వమైన గౌరవం.

మోహన్ రాకేశ్ స్వాతంత్ర్యానంతరం 1950లలో పునరుజ్జీవన దశలో హిందీ రంగస్థల దిశనే మార్చేశారు. భారతేందు హరిశ్చంద్ర, జయశంకర్ ప్రసాద్ అంతటి వాడు అనిపించు కున్నారు. సమాజ సంవేదనలు, అనుభూతులను పట్టి చూపడంలో రాకేశ్ అందె వేసిన చేయి. హిందీ నాటక రంగాన్ని నేల మీద నిలబెట్టారు రాకేశ్. ఆయన వ్యష్టి వాది. సున్నిత మనస్కుడు. అంతర్ముఖుడు. ఈ లక్షణాలన్నీ ఆయన నాటకాల్లోనూ, కథల్లోనూ ప్రతిబింబిస్తాయి.

మోహన్ రాకేశ్ 13వ ఏటనే సంస్కృతంలో కవిత్వం రాయడం ప్రారంభించారు. మృచ్ఛకటికం, కాళీదాసు శాకుంతలం నాటకాలను హిందీలోకి అనువదించారు. మోహన్ రాకేశ్ క్రమశిక్షణారాహిత్యం, విచ్చలవిడితనం ఆయనకు నష్టం కలగజేసి ఉండొచ్చు. వ్యక్తిగత అలవాట్ల కారణంగా 47 ఏళ్లకే తనువు చాలించి ఉండొచ్చు. కాని ఆయన చేసిన కృషి ఇప్పటికీ అపురూపమైందే.

ఆర్వీ రామారావ్

కాంచన మాల

కాలం క్రమానుసారి
అక్రమాలు ఒప్పదు
గ్రీష్మం చేటలకెత్తి చెరుగుతుంది
వసంతాలు విరబూస్తుంది
వర్షాగమనం
హేమంత తుషారం
శిశిర శైత్యోపచారం....
తన ఉడుపులే వడుపులే
అనంత పయనంలో అవిశ్రాంత మెరుపులే
స్తబ్దతకు తావివ్వదు
జడత్వం తెలియని విద్య
నిరత చైతన్యశీలి
క్షణమైనా వృథా పుచ్చని ధీశాలి
గడచిన ఏ క్షణాన్ని తిరిగి పొందదు
విద్యుక్త ధర్మాన్ని అడచి ఆగదు
నిరంతరాయం వినూత్న విఘడియల సృష్టిఆపదు
ఆదర్శమూర్తి తను, ఆవేశ స్ఫూర్తి తను
చైతన్య దీప్తి తను, చలత్ చరిత్ర తను
దోషాలు ప్రదోషాలు ఒల్లదు
ప్రకృతి సహానుగమనం గతి తప్పదు
అతిక్రమించిన ఏరికైనా పోతలే
క్యాన్సర్ ఎయిడ్స్ కరోనా వగైరాలన్నీ
మానవమహాక్రమాలకు తనుతేల్చిన వాతలే!
నిరతానుసారికి
నితాంత దురంత కీర్తికి
కడచే ప్రతి నిమిషం ప్రాతదే
ప్రభవించే ప్రతి క్షణం క్రొత్తదే
ఈ నవవర్షం సైతం
తన లీలానంత దిగంత హేల
హస్తధారులు కండి చైతన్య జ్వాల
సంకల్పం మంచిదైతే సన్మార్గం నీదైతే
కాలం కాంచన మాల
శుభాశీస్సులు శుభాకాంక్షల
సుధా రీతుల సువిధగీతుల సౌభాగ్య దోల!

ముర్తుజా ఎస్

క్యాలెండర్...!



పాత నీటిని పక్కకు నెట్టి
కొత్త నీరొచ్చి చేరినట్టు
వసంతాన్ని పక్కకు నెట్టి
వానాకాలం తిష్ఠ వేసినట్టు
ఆకులన్నీ రాల్చుకున్న వృక్షం
కొత్త చిగుళ్ళతో కొత్తరూపు
సంతరించుకున్నట్లు..!
పన్నెండు నెలలుగా గోడకు తిష్ఠవేసిన
క్యాలెండర్ను నెట్టివేసి
కొత్త క్యాలెండర్ వచ్చి చేరింది...!
గతం గాయమై వేధించినా
వర్తమానంలోని ఆశలు
భవిష్యత్తుకు బాటలు వేస్తున్నా...!
రంగురంగుల 'క్యాలెండర్'...
ఈసారైనా నా జీవితానికి రంగులద్దుతుందో...
పన్నెండు పేజీలలో ఏదో
ఒక పేజీ జీవితాన్ని మలుపు తిప్పక పోతుందా
అని ఆశతో నిరీక్షిస్తూ..!

డాక్టర్ మహమ్మద్ హసన్,
సెల్: 9908059234

'సముద్రం' అంశంపై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక శ్రీ ఆళ్ల దశరధరామిరెడ్డి స్మారకంగా 'సముద్రం' అంశంపై కథలపోటీ నిర్వహిస్తూ ఈ కథలతో ప్రత్యేక కథాసంపుటి వెలువడుతుంది. ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు 5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు 3000/-, తృతీయ బహుమతి ఐదుకథలకు ఒక్కో కథకు 2000/- వంతున ప్రదానం చేస్తారు. సాధారణ ప్రచురణకు ఎన్నికయిన ప్రతి కథకు వెయ్యి రూపాయలు బహుమతి అందజేస్తారు. ప్రతి కథకు సంపుటి ఆవిష్కరణసభలో నగదు బహుమతి, ఈ కథాసంపుటితో పాటు సత్కారం ఉంటుంది. ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి. సముద్రం చుట్టూ అలలు అలలుగా ఎన్నో సమస్యలు. ఏ అంశం అయినా కథావస్తువుగా స్వీకరించవచ్చు. జనవరి20 లోపు విశాలాక్షి సాహిత్య మాసపత్రిక, 27-5-487 పద్మావతి నగర్, బాలాజీ నగర్ ఎక్స్‌టెన్షన్, నెల్లూరు 524002, ఫోన్.9440529785కు పంపాలి.

ఈతకోట సుబ్బారావు, 9440529785

ప్రయాణమే బతుకైన వారి కథ

ఎస్. హనుమంతరావు, సెల్: 8897815656

'బస్సు ప్రయాణం అదో కొత్త ప్రపంచం'. వానలో తడవనివారు, ఎప్పుడో ఒకప్పుడు బస్సు ఎక్కనివారు అంటూ ఎవరూ ఉండరు. బస్సు బొమ్మతో ఆడని బాల్యమూ ఉండదు. ఇవన్నీ భావుకత నిండిన మాటలు... కాని రచయిత ఆదిరెడ్డి మావుళ్లుకి "బస్సు" బతుకు తెరువు. ఆయన బతుకు తెరువునే మన కోసం "డ్యూటీ" నవలగా తెరిచారు. తన ఉద్యోగ ప్రస్థానంలో ఎదురైన అనుభవాల పరంపరే ఈ నవల. బహుశా కొన్ని అనుభవాలు ఆయన సహచర ఉద్యోగులవి కావొచ్చు.

ఓపినింగ్ బ్యాంగ్‌తో సినిమా మొదలై ప్రేక్షకులను మూడ్‌లోనికి తీసుకెళ్లినట్టు ఈ నవల ఒక ఆసక్తికర సన్నివేశంలో మొదలవుతుంది. దాడికి గురి అయిన ఓ బస్సు విశాఖ కె.జి.హెచ్ ఎమర్జెన్సీ వార్డు ముందుకి వచ్చి ఆగుతుంది. బస్సులో నుండి గాయపడ్డ ఓ యువకుణ్ని కండక్టర్ కనకారావు, డ్రైవర్ చక్రధరం సాయంపట్టి ఆసుపత్రిలో చేర్చుతారు. అవసరమైన రక్తం ఇచ్చి అతన్ని ప్రాణాపాయం నుండి కాపాడతారు. ఉత్సుకత రేకెత్తించే ఈ సన్నివేశంలో నవలకి నాంది ప్రస్తావన జరుగుతుంది. ఈ సన్నివేశంలో ముఖ్య భూమిక కండక్టర్ కనకారావుదే. ఈ సన్నివేశంలోనే కాదు, నవలంతా ఈ పాత్రదే అని చెప్పాలి. కనకారావు రచయిత 'ఆల్టర్ ఇగో' గా భావించవచ్చు ఆ పాత్ర రచయిత ప్రతిరూపమే! ఇది ఒక రకంగా ఆటో బయో గ్రాఫికల్ నవల. ఆత్మకథలో యదార్థానికి పెద్దపీట వెయ్యాలి. కాని 'ఆత్మ కథాత్మక' నవలల్లో రచయితకి ఫిక్షనల్ ఫ్రీడం ఉంటుంది. ఏది రచయిత జీవితం, ఏది కల్పితం అన్నది తెలుసుకోవడం పరిశోధనకి సంబంధించిన విషయం. నవలలోనికి వెళ్లిన తర్వాత ఇది రచయిత వ్యక్తిగత జీవితం కాదు అని తెలుస్తుంది. రచయిత ఉద్యోగ జీవిత సాహిత్య రూపం ఈ నవల అన్న సంగతి రూఢి అవుతుంది. మరో రకంగా చెప్పాలంటే రచయిత పనిచేసిన సంస్థ కథ అనుకుంటే సరిగా ఉంటుందేమో! ఇంతకు ముందు బస్సులు నడిపే రవాణా సంస్థపై నవల వచ్చినట్టు కనిపించదు. కథలు వచ్చాయి. తెలుగులో ఘండికోట బ్రహ్మాజీరావు 'శ్రామిక శకటం', 'విజయవాడ జంక్షన్', 'పరుగిడే చక్రాలు ప్రవహించే జీవన వాహిని' వంటి రైల్వే నవలలు రాశారు. అవి ఆయన ఉద్యోగ అనుభవాల కాల్పనిక రూపాలు. ఈ కోణం నుండి చూస్తే మావుళ్లు ఈ 'డ్యూటీ' నవల విశిష్టత మనకి అర్థమవుతుంది.

ఈ నవల 'జీవనహింస' పేర ఒక పత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఇదే ఇప్పుడు 'డ్యూటీ' పేరు మీద పుస్తకరూపంలో విశాలాంధ్ర ప్రచురణాలయం తీసుకువచ్చింది. ప్రముఖ మార్క్సిస్టు విమర్శకురాలు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ తన నవలశిల్పం అన్న గ్రంథంలో 'రచయిత స్వయంగా భాగమైన సమాజాన్ని నవలగా మార్చడం కష్టం' అని అంటారు. ఈ కష్ట సాధ్యమైన పనిని రచయిత తన అనుభవంతో తేలిగ్గానే సాధించారనిపిస్తోంది. రచయిత ఈ నవలా రచనలో చాలా జాగ్రత్తలు తీసుకుని తను పనిచేసిన సంస్థపై ఎక్కడా నెగిటివ్ రిమార్కులు చెయ్య లేదు. పైగా సంస్థ అంటే రచయితకి చాలా భక్తి, ప్రేమ. ఈ విషయం అనేక చోట్ల చాటుకుంటాడు. 'నీడనిచ్చే చెట్టును పీడ' అన కూడదు. కొండంత అండగా భావించాలి. ఇలాంటి సేవచేసే అదృష్టం ఎంతమందికి లభిస్తుందిఅని అంటాడు ఓ చోట. ఈనవలలో ఒక్కో డ్యూటీ...ఒక్కో అనుభవం... ఒక్కో ఛాప్టర్‌గా సాగింది. ఛాప్టర్ల మధ్య చాలావరకు లింక్ కనిపించదు. ఒక ఛాప్టర్ని వదిలేసినా నవలని చదవ డానికి ఇబ్బంది ఏమీఉండదు. కొన్నిచోట్ల కథనపు అల్లికలో కొంచెం బిగితగ్గినట్టు అనిపించింది. అయితే కొన్ని అధ్యాయాల్లో బలమైనఅంశాలు ప్రస్తావనకు రావడంతో పాఠకుల ఆసక్తి చెదరదు. ఇరవై నాలుగు గంటలు పని చేసేసంస్థ కాబట్టి రన్నింగ్ స్టాఫ్‌కి సెలవులు పెద్దసమస్య. సెలవులు కోరేవారికి, ఇచ్చేవారికి ఎంతో టెన్షన్‌తో కూడుకున్న వ్యవహారం. ఇది అనాదిగావస్తున్న సమస్య. అతిపెద్ద సమస్య అని రచయిత వ్యాఖ్యానం. అలాగే డ్యూటీలను సర్దుబాటు చెయ్యడం ఒక తీవ్ర సమస్య. ఒకచోట డ్రైవర్ నూకరాజు, కంట్రోలర్ సోము మధ్య డ్యూటీవిషయమై ప్రారంభమైన మాటలు మంటలు పుట్టిస్తాయి. విధినిర్వహణలో కలిగేఒత్తిడి ఇద్దరిలో విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఫలితం ఒకరిపైఒకరు చేయి చేసుకోవడం. శిక్షపడి నూకరాజు ఉద్యోగం కోల్పోవడం. అధికారి ప్రమోషనార్హత పోగొట్టుకోవడం సంభవిస్తుంది. ఈ ఘటనను రచయిత చాల సహజంగా చిత్రించారు. ఇక్కడ ఇద్దరు వ్యక్తులూ సౌమ్యులూ, మంచివారు అయినా ఉద్యోగఒత్తిడి తీవ్రతవారు అలా ప్రవర్తించే విధంగా చేసింది అంటారు రచయిత.

ఒకసారి జన సంచారంలేని ఒక ప్రదేశంలో బస్సు బ్రేక్ డవున్ అవుతుంది. డ్రైవర్ స్పేర్ పార్టుల కోసం, మెకానిక్ కోసం విజయనగరం డిపోకి వెళతాడు. ఆ సమయంలో బస్సుకి కాపలాగా కండక్టర్ కనకరాజు ఒక్కడే ఉంటాడు. డ్రైవర్ తిరిగి వచ్చేటప్పటికి ఇంచుమించు 24 గంటలు పడుతుంది. ఈలోగా కనకారావు నిరాహారంగా ఉండాల్సి వస్తుంది. దాహం తీర్చుకోవడానికి మంచినీళ్లు కూడ ఉండవు. అనుకోకుండా ఉరుములూ, మెరుపులు, కుండపోత వర్షం ప్రారంభమవుతుంది. వర్షపు నీటితోనే దాహం తీర్చుకుంటాడు రావు. ఈ సన్నివేశాన్ని శక్తిమంతంగా దృశ్యీకరించారు రచయిత. సంస్థలో పనిచేసే ఒక వైద్యుడు తన పదవీ విరమణ సభలో ప్రసంగిస్తూ.. ప్రయాణాలు ఎక్కువ చేసే వారికి గుండెజబ్బుల ప్రమాదంఎక్కువ అని చెబుతారు. ఐ.ఎం.ఏ పూనిక మీద కలకత్తా యూనివర్శిటీ చేసిన పరిశోధన. తేలిన అంశం ఇది. మామూలు జనం సరే...మరి ప్రయాణమే ఉద్యోగ మైన వారిసంగతి? అనే ప్రశ్న లేవనెత్తారు రచయిత.

ఉద్యోగుల దురలవాట్లు, మితిమీరిన క్రమశిక్షణా చర్యలు, పని ఒత్తిడి కారణంగా ఈ సంస్థలో మరణాల రేటు చాలా ఎక్కువ అంటారు రచయిత. డిపో లెవెల్లో ఆరు నెల్లకు ఒకటి, రీజియన్ పరిధిలో నెలకి ఒకటి, జోనల్ స్థాయిలో నెలకు రెండు మూడు, రాష్ట్ర స్థాయిలో రోజుకి నాలుగైదు ఆకలి మరణాలు సంభవిస్తూ ఉంటాయని రచయిత ఆవేదనతో చెబుతారు. ఈ నవలని సర్వీసులో ఉండగానే చావు నోటచిక్కి అర్థాంతరంగా అదృశ్యమై పోయిన తన సహచరులకే అంకితం ఇచ్చారు రచయిత. ఒకసారి డ్రైవర్ బషీర్ బస్సు నడుపుతుండగా తీవ్రమైన దగ్గు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అప్పుడు కనకారావు సమయస్ఫూర్తితో వ్యవహరించి, బస్సుని, అందులో ప్రయాణం చేస్తున్న వారిని ప్రమాదం నుండి కాపాడతాడు. తర్వాత బషీర్‌ని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తాడు. ఇదంతా మానవతా దృక్పథంతో చేస్తాడు కనకారావు. కాని ప్రత్యర్థి యూనియన్ వాళ్లు అతని సాయానికి రాజకీయ రంగు పులుముతారు. సంస్థలోని కార్మిక సంఘాలపై చురక ఈ సన్నివేశం. అయితే సంస్థలోని కార్మిక సంఘాలపై పాజిటివ్ కామెంట్ చేసిన ఘటనని కూడ ఈ నవలలో చూస్తాం. ఒక మందుబాబును అన్ని యూనియన్లు కలిసి బహిష్కరణ భయంతో వ్యసనం నుండి దూరం అయ్యేట్టు చేస్తాయి.

నవలలో అక్కడక్కడా మెరికల్లాంటి వ్యాఖ్యలు కనిపిస్తాయి. వృత్తిని బట్టి మనిషి వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుంది. అలవాట్లు మొదట మనిషిని సాలెగూళ్లలా అల్లుకుంటాయి. ఆపై సంకెళ్లై బంధిస్తాయి. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. రచయితలో మంచి హాస్య చతురత ఉంది. కనకారావు అత్తగారు 'డ్యూటీ' అన్న పదాన్ని పలకలేక "ఊటీ" అని అంటుంది. డ్యూటీ ఊటీలా చల్లగా హాయిగా ఉండదనే శ్లేష కూడ ఉంది ఇక్కడ. ఈ రంగంలో కనిపించే కోడ్ వర్డ్స్ గురించి ఒక అధ్యాయమే రాశారు రచయిత. ఇవి ఒక్కోసారి మొరటుగా, ఎబ్బెట్టుగా ఉంటాయి. ఉద్యోగంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించు కోవడానికి ఇదోమార్గం అంటారు రచయిత. సైకాలజీ కూడ ఇదే చెబుతుంది.

ఈ సంస్థలో పనిచేయడం అంటే అంత తేలిక కాదు. నిప్పులు చెరిగే ఎండల్లో, కుండపోత వర్షంలో, గడ్డకట్టుకు పోయే చలిలో వేళగాని వేళల్లో డ్యూటీలు చేయాల్సి వస్తుంది. ఆ కష్టం అనుభవించిన వారికే తెలుస్తుంది. ఈ భీకర స్థితిని ఈ నవల బాగా చిత్రించింది. తల్లి మరణశయ్య మీద ఉన్నా డ్యూటీ చెయ్యక తప్పని కాంట్రాక్ట్ డ్రైవరు ఉదంతం గుండెల్ని పిండుతుంది.

నవల చదువుతుంటే ఏ విజయవాడ గాంధీ బస్‌స్టేషన్లోనో, హైదరాబాద్ ఇమ్లీబన్ బస్టాండులోనో తిరుగుతున్నట్టే అనిపిస్తుంది. లేదా బస్సులో ప్రయాణం చేస్తున్నట్టు ఒక్కోసారి కిటికీ పక్క సీట్లో చల్లగాలిని ఆస్వాదిస్తూనో లేదా ఎక్కువ సార్లు ఉక్కపోత ఉన్నప్పుడు నిలబడి ప్రయాణం చేస్తున్నట్టో పాఠకుడికి అనిపిస్తుంది. వాతావరణ కల్పనలో రచయిత సాధించిన పరిపక్వతకి ఇది తార్కాణం. బస్సు ప్రయాణం గురించి ఒకాయన అన్నాడు. 'వేర్ యూ కెన్ విట్‌నెస్ బోత్ ది బెస్ట్ అండ్ ది వరెస్టు ఆఫ్ హ్యూమానిటీ' అని. ఈ రెండు రకాల ప్రవర్తనల మధ్య కండక్టరు శాండ్‌విచ్ అనిపిస్తుంది. బహుముఖీనమైన ఈ గొప్ప సంస్థపై ఇప్పటికే ఎన్నో పరిశోధనలు జరిగి ఉంటాయి. కొత్తగా పరిశోధన చెయ్యాల్సిన విద్యార్థులకు ఈ నవల ఒక దారిదీపంలా, గైడులా పనికి వస్తుంది. ముఖ్యంగా హ్యూమన్ రిసోర్స్ వింగ్ పై పరిశోధనలకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

ఇక ముగింపుకి వద్దాం. ఈ సందర్భంగా నవల ప్రారంభ సన్నివేశాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం. కె.జి.హెచ్‌లో గాయపడ్డ కుర్రాడి ఉదంతం. బస్సుని కాల్చిన కాలేజీ కుర్రాళ్లు ఎవరికి వారు తప్పించుకోగా, తలకి రాయి దెబ్బతగిలి స్పృహ కోల్పోయిన కుర్రాణ్ణి అదే బస్సులో వేసుకుని ఆసుపత్రిలో చేరుస్తారు కండక్టర్, డ్రైవర్. రక్తం ఇచ్చి అతని ప్రాణం కాపాడ్డమే కాదు, పోలీసుల సలహా మేరకు, బస్సులో దాడిచేసిన గుంపులో వాడే అయినా, కుర్రాణ్ణి ప్రయాణీకుడిగా ప్రకటించి అతని జీవితాన్ని కాపాడతారు కనకారావు అతని మిత్రుడూను. 'ఆల్ రోడ్స్ లీడ్స్ టు రోమ్' అన్నట్టు మిగతా పిల్ల కథలన్నీ చకచకా కె.జి.హెచ్‌కే చేరతాయి. గర్భవతి అయిన కనకారావు భార్య వినీత కూడ ప్రసవానికి అక్కడికే చేరుకుంటుంది. కథ క్లైమాక్స్‌కి వస్తుంది. సుఖాంతం అవుతుంది. సరిగా 235వ పేజీలో డ్రైవర్, కండక్టర్ డ్యూటీ దిగుతారు. వారితోపాటు మనమూ డ్యూటీ దిగుతాము. ఈ 'డ్యూటీ'లో అనేక రకాల అనుభవాలు, అనుభూతులు పొందుతాము. సాహిత్య ప్రధాన లక్షణం ఇదే కదా! 'జిందగీ ఏక్ సఫర్' అన్నాడు కవి. 'సఫరే జిందగీ అయిన వాళ్ల కథ ఇది'. పయనమే జీవనమైన వారి కథ ఇది. మనం అనేక సందర్భాల్లో బస్సుల్లో ప్రయాణం చేసి ఉంటాం. ఒక్కోసారి ఏవో ఇబ్బందులు ఎదురయ్యే ఉంటాయి. కాని ఈ నవల చదివిన తర్వాత ఆ సమస్యల్ని మనం తీసుకునే విధానంలో కచ్చితంగా మార్పు వస్తుందని నేను నమ్ముతున్నాను. ఇది రచయిత సాధించిన విజయం.

(విశాఖ విశాలాంధ్ర పుస్తక మహోత్సవం వేదికపై చేసిన సమీక్షకి వ్యాస రూపం)

మతతత్వ బీజేపీని తరిమికొడదాం...

ఇండియా కూటమికి మద్దతు పలుకుదాం

వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తోంది. ప్రజల మధ్య కులమత విద్వేషాలను రగిలిస్తూ దేశ సమగ్రతను దెబ్బ తీస్తోంది. ప్రజా పోరాటాలను సైతం అణిచివేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో బీజేపీ పాలన కొనసాగితే భారత రాజ్యాంగ అస్తిత్వమే కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. దీనికి తోడు రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీ విధానాలకు అండగా నిలుస్తుండటం అత్యంత దురదృష్టకరం. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా లభించిన హక్కులను... ముఖ్యంగా ప్రత్యేక హోదా సహా ఇతర అంశాలను సైతం ప్రశ్నించలేని దుస్థితిలో ఈ పార్టీలు ఉన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ, దేశ, రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం దళిత,గిరిజన,బహుజన, మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం రానున్న ఎన్నికల్లో భావసారూప్యం కలిగిన పార్టీలతో కూడిన 'ఇండియా' కూటమికి అండగా నిలవాల్సిన చారిత్రక ఆవశ్యకత ఉందని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. అదివారం విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అధ్వర్యంలో బీజేపీ, దాని విధేయ పార్టీలకు వ్యతిరేకంగా భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు, దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, ప్రజాసంఘాల నేతలతో సమాలోచన సమావేశం నిర్వహించారు.

పేదలపై భారం మోపడమే బీజేపీకి తెలుసు: జేడీ శీలం

సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లుగా పేదలు, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ వర్గాలకు అండగా ఉంటూ వారి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నవరత్నాలను, విశాఖ ఉక్కు ఓడరేవులు, రైల్వేస్టేషన్‌లను ప్రైవేట్‌పరం చేసి... బడా పారిశ్రామిక వేత్తలకు విక్రయించడం, పేద ప్రజలపై భారాలు మోపటం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరలా కేంద్రం, రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలన రావాలని తమకు వ్యతిరేకంగా ఉన్నవారు సైతం కోరుకుటున్నారన్నారు. అందుకు ఉదాహరణ కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో వచ్చిన ప్రజా స్పందనే నిదర్శనమని తెలిపారు. అదే పరిస్థితి రానున్న కాలంలో రాష్ట్రంలో కుడా రాబోతోందన్నారు. పార్టీని వదిలి వెళ్లిన నాయకులు సైతం మరలా తిరిగి రావటానికి ప్రయత్నాలు చేస్తున్నారని... నూతన ఏడాదిలో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి మంచి అదరణ వస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రంలో కుడా బీజేపీ వ్యతిరేక పక్షాలను కలుపుకుని ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని... రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీతో రాజ్యాంగం అస్తిత్వానికే ముప్పు: జల్లి విల్సన్

సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ మతోన్మాదం, మనువాదానికి వ్యతిరేకంగా దేశాన్ని రక్షించటం కోసం ఇండియా కూటమి పని చెయ్యాలని పిలుపునిచ్చారు. కర్నాటక, తెలంగాణలో బీజేపీని ప్రజలు చావు దెబ్బ కొట్టారన్నారు. అయితే ప్రజల మధ్య మతోన్మాదం పెంచటానికి కుటిలప్రయత్నాలు చేస్తోందని... జనవరి 22న అయోధ్యలో జరిగే రామమందిర ప్రారంభం దానిలో భాగమేనని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ పరిపాలన కొనసాగితే భారత రాజ్యాంగ అస్తిత్వమే కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమంలో సీపీఐ పాలు పంచుకుంటుందన్నారు. రాష్ట్రంలో దళిత, గిరిజన, బహుజనుల మద్దతు పొందాలంటే కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేసేవిధంగా ఈ సభలో తీర్మానం చేయాలని కోరారు.

'ఇండియా' కూటమి అధికారం చేపడితేనే ప్రత్యేక హోదా సాధ్యం: రుద్రరాజు

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తోందన్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, రాష్ట్ర స్థాయిలో వైసీపీ పార్టీలకు వ్యతిరేకంగా ఉన్న వారి సమస్యలు తెలుసుకొని... తగు కార్యాచరణను రూపొందించి ముందుకు సాగుతామన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించాలంటే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని...అందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2 నుండి 11 వరకు అన్ని జిల్లాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల వారిని కలిసి వారి సమస్యలు తెలుసుకుని... వారికి అండగా ఉంటూ ప్రజాక్షేత్రంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలిసి పనిచేయదానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలోనే దళిత మహిళల మీద దాడులు జరుగుతున్నా సీఎం జగన్ మోహన్ రెడ్డికి పట్టడం లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. వైఎస్ షర్మిలను కచ్చితంగా కాంగ్రెస్ ఆహ్వానిస్తుందన్నారు. సిపీఎం నాయకుడు వై.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. అనేక చట్టాలను నిర్వీర్యం చేశారని... రాజ్యాంగ స్వరూపం కూడా మార్చేస్తూ... హక్కులను కాలరాస్తున్నారన్నారు. జనవరి 12వ తేదీన బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని... దానికి ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో అవసరమైన ఎత్తుగడలు తీసుకుని బీజేపీని ఎలా ఓడించాలనేది ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి విజయ్‌కుమార్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ తాంతియా కుమారి, ఏపీ ఎస్సీ,ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఉప్పులేటి దేవి ప్రసాద్ మాట్లాడుతూ ఇండియా కూటమి గురించి రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు సుంకర పద్మశ్రీ, నరహరిశెట్టి నరసింహారావు, వాలిబోయిన గురునాథం, కొలను కొండ శివాజీ, పట్టపు శీనయ్య, ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, మేళం భాగ్యారావు, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనేని దంపతుల జీవితం ఆదర్శనీయం

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడలోని కంకిపాడు నుంచి సీపీఐ శాసనసభ్యుడిగా రెండుసార్లు ఎన్నికై, ప్రజల కోసం పాటుపడిన మైనేని లక్ష్మణస్వామి మరణించి 36ఏళ్లు గడిచినా అయన జీవితం ఆదర్శనీయమని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. లక్ష్మణ స్వామి సతీమణి, ప్రముఖ విద్యావేత్త జయప్రద సంస్మరణ సభ ఆదివారం స్థానిక ఆహ్వానం కళ్యాణ మండపంలో జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు. సభలో నారాయణ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను ఎదురొడ్డి లక్ష్మణ స్వామి దంపతులు కమ్యూనిస్టు ఉద్యమానికి కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. జయప్రద కృష్ణా జిల్లాలో ఉత్తమ సైన్స్ అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వహించారని అన్నారు. ఆమె భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అందజేయడం గొప్ప విషయమన్నారు. విశాలాంధ్ర పత్రిక పూర్వ సంపాదకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకుని ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాద దేశాల కుట్రల్ని అడ్డుకునేది కమ్యూనిస్టు- సోషలిస్టు దేశాలేనని, నేడు దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడినప్పటికీ బూర్జువా, కార్పొరేట్, ఫ్యాసిస్టు ప్రభుత్వాలకు ఎప్పటికైనా సోషలిజం కమ్యునిజమే ప్రత్యామ్నాయమన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జయప్రద లక్షణస్వామి సన్నిహితులు, సీపీఐ జిల్లా నాయకులు మాట్లాడుతూ వారు చేసిన కృషిని కొనియాడారు. కృష్ణాజిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా, సీపీఐ జిల్లా కార్యదర్శిగా లక్ష్మణ స్వామి తోడ్పడ్డారని ఆనాటి విషయాలను గుర్తు చేసుకున్నారు.

ప్రముఖుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురు చూడటానికి, కొత్త అవకాశాలు అన్వేషించడానికి, కొత్త లక్ష్యాలను సాధించడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. 2024లో ప్రతి కుటుంబంలో ఆనందాలు, అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

నేటినుంచి రూ.3వేల పింఛన్

లబ్ధిదారులకు సీఎం లేఖలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ పెన్షన్ అమలులో భాగంగా పెంచిన రూ.3వేల పింఛన్ జనవరి 1 నుంచి లబ్ధిదారులకు అందనుంది. నూతన సంవత్సరంలో అనేక సంక్షేమ పథకాలకు, కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనవరిలో మూడు, ఫిబ్రవరిలో ఒకటి కలిపి మొత్తంగా నాలుగు కార్యక్రమాల అమలుకు సన్నద్ధమైంది. వైఎస్ఆర్ పెన్షన్ అమలులో భాగంగా 66లక్షల మంది లబ్ధిదారులకు సీఎం లేఖలు రాశారు. 1వ తేదీన వలంటీర్లు ఇంటింటా తిరిగి, లబ్ధిదారులకు రూ.3వేల పింఛన్‌తో పాటు సీఎం లేఖలు అందజేస్తారు. రూ.2,750 ఉన్న పెన్షన్‌ను రూ.3వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. జనవరి 19న విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. 23 నుంచి 31వ తేదీ వరకు ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు వైఎస్ఆర్ చేయూత కొనసాగుతుంది. ఆయా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే.

3న కాకినాడలో సీఎం పర్యటన

వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి 3వ తేదీన కాకినాడలో పర్యటిస్తారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి వెళతారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం తాడేపల్లికి తిరిగి వస్తారు.

'కలెక్టరేట్ ముట్టడి'ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చింతలపూడి: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారం కోసం జనవరి 3న తలపెట్టిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.లలిత పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల జేఏసీ అధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారంతో 20 రోజులకి చేరింది. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం చింతలపూడిలోని అంగన్‌వాడీల నిరశన శిబిరాన్ని సందర్శించిన అనంతరం లలిత మాట్లాడుతూ... గత కొన్ని మాసాలుగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిం చాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో సమ్మెలోకి దిగాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు నిర్వహించినప్పటికీ... తెలంగాణ ప్రభుత్వం కన్నా వెయ్యి రూపాయల ఎక్కువ జీతం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌ను ఆమోదించకుండా సమ్మె వాయిదా వేసుకోమనడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని విమర్శించారు. రాబోయేది మన ప్రభుత్వమేనని... అప్పుడు పెంచుతామని అప్పటివరకు సమ్మె విరమిం చాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రాట్యుటీ అంశం తమ పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వం చేయాలంటున్నారని... సమస్యలను పక్కదారి పట్టించే విధంగా చర్చలు జరిగాయని విమర్శించారు. తప్పనిసరిగా జీతం పెంపుదల, గ్రాట్యూటీ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేస్తూ అంగన్‌వాడీ జేఏసీ సమ్మెను కొనసాగించాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంధం అంజమ్మ, కోశాధికారి రాచప్రోలు మరియమ్మ, విజయలక్ష్మి, మల్లేశ్వరి, సీఐటీయూ మండల అధ్యక్షురాలు నత్త వెంకటేశ్వరరావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అరెస్టు అక్రమం

సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర- ఇబ్రహీంపట్నం: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కొండపల్లి, ఇబ్రహీంపట్నం లలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ఓ ప్రకటనలో విమర్శించారు. మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ గత నెల రోజుల క్రితమే ప్రభుత్వానికి సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ముందస్తు నోటీసులు ఇచ్చి సమ్మె చేపట్టిందన్నారు. మహిళా కార్మికులతోసహా అందరినీ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించటం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. అరెస్టయినవారిలో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జీ మధుసూదన్ రావు, టీ సుబ్బారావు, టీ నరసింహారావు, వీ తిరుపతిరావు, శ్రీరామ్, దుర్గ, నాగమణి, లాలమ్మ, ఏఐటీయూసీ నాయకులు గొల్లపూడి ప్రసాద్, బసవయ్య, ఎం ఏడుకొండలు తదితరులు ఉన్నారు. పోలీసులతో తోపులాటలో తీవ్ర అస్వస్థతకు గురైన సీఐటీయూ నాయకుడు మహేశ్‌ను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మహేశ్‌పై దాడి చేయటాన్ని కూడా కోటేశ్వరరావు ఖండించారు. మహిళా కార్మికులు స్పృహ తప్పటం ఆందోళన కలిగించే విషయమంటూ పోలీసుల తీరును తప్పుపట్టారు. సమస్యలను పరిష్కరిం చడంలో జాప్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాలని, ఇప్పటికైనా పరిస్థితులు విషమించక ముందే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులకు గురైె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో నిర్బంధంలో ఉన్న కార్మికులను సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ దుర్గ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కన్నా వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించారు. వారి ఆందోళనకు పూర్తి సంఘీభావాన్ని తెలిపారు.

చంద్రబాబు అవినీతిపై ప్రధానికి పవన్ లేఖ రాయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదల ఇళ్లపై కాదు చంద్రబాబు అవినీతిపై ప్రధాని మోదీకి లేఖ రాసే దమ్ముందా అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు మంత్రి జోగి రమేశ్ సవాల్ విసిరారు. పవన్ లేఖలోని ప్రతి అంశంపై చర్చకు సిద్ధమన్నారు. రాష్ట్రంలో ఇల్లు-వాకిలి లేని వాళ్లంతా లేఖలు రాస్తున్నారని ఎద్దేవా చేశారు. నాడు మూడు సెంట్ల స్థలం ఇస్తానని ఎగ్గొట్టిన బాబుపై ఏనాడైనా ప్రశ్నించావా? అని పవన్‌ను నిలదీశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జోగి రమేశ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ బుర్రలేని ఆరోపణల చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇళ్ల నిర్మాణం పారదర్శక ప్రక్రియని చెప్పారు. ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. 17వేలకు పై చిలుకు జగనన్న కాలనీలు, 21 లక్షల ఇళ్లు కడుతున్నామన్నారు. కడుతున్నది ఇళ్లు మాత్రమే కాదు... ఊళ్లకు ఊళ్లే వేగంగా నిర్మాణమవు తున్నాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ నిరుపేదలపై ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని విమర్శించారు. స్కిల్ స్కాంలో పవన్ వాటాపై ప్రధాని మోదీకి తాము లేఖ రాస్తామని జోగి రమేశ్ వ్యాఖ్యానించారు.

కొలికపూడి తప్పేమిటి? అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా ఉద్యమ నేత కొలికపూడి శ్రీనివాస రావును వేధిస్తుండటం దుర్మార్గమని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. కొలికపూడి చేసిన తప్పేమిటి? ఎందుకు వేధిస్తున్నారు? అని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. అచ్చెనాయుడు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కొలికపూడి ఇంటికి ఏపీ సీఐడీ అధికారులు సందర్శకులుగా వెళ్లి బీభత్సం సృష్టించారని ఆరోపించారు. కొలికపూడితో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఏపీ సీఐడీ అధికారులు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. 11ఏళ్ల పాపకు నోటీసులు ఇస్తామనటం సిగ్గుచేటని అన్నారు.

ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా అరవింద్ పనగరియ

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగరియ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా నియమితులయ్యారు. అదేవిధంగా రిత్విక్ రంజనమ్ పాండేను ఆర్థిక సంఘం కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యుల పదవీకాలం 2025 అక్టోబరు 31న ముగియనుంది. ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దాని స్థానంలో తీసుకొచ్చిన నీతి ఆయోగ్‌కు తొలి ఛైర్మన్‌గా అరవింద్ పనగరియను ప్రధాని మోదీ 2015లో నియమించారు. కాగా అరవింద్ పనగరియ 1952 సెప్టెంబరు 30న జన్మించారు. ఉన్నత విద్యాభ్యాసం అనంతరం న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థలో పనగరియ వివిధ హోదాల్లో పని చేశారు.

పీఎంఓను అయోధ్యకు మార్చాలి

ముంబై : ప్రధాన మంత్రి కార్యాలయం (పీవోవో) ను అయోధ్యకు మార్చాలని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ బీజేపీని ఎద్దేవా చేశారు. అయోధ్యలోని రామాలయం ప్రారంభోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వేడుకలపై అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. శ్రీరాముడి ఉత్సవాలకు బీజేపీ నాయకత్వం ఎవరికీ అవసరం లేదని, కొద్ది రోజులుగా ప్రధాన మంత్రి కార్యాలయం, బీజేపీ కార్యాలయాన్ని అయోధ్య నుంచే నడుపుతున్నట్లు తెలుస్తోందని రౌత్ విమర్శించారు. ఇది మంచి విషయమే అయినా... పీఎంఓను అయోధ్యకు మార్చాలంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ప్రతి ఇంటిలో రామజ్యోతి వెలిగించాలన్న బీజేపీ పిలుపు అవసరం లేదని సంజయ్ రౌత్ అన్నారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజు జనవరి 22న దేశ ప్రజలందరూ దీపావళి జరుపుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

దళితుల సమస్యలపై పోరాడండి: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం దళిత సంఘాలను కలుపుకుని పోరాటాలను ఉధృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. స్థానిక దాసరి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) అధ్యక్షులు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులు, అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు డీహెచ్‌పీఎస్ నాయకత్వంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో ఆందోళనలు, దీక్షలు పట్టుదలతో నిర్వహిం చడాన్ని అభినందించారు. సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాసే పాలకుల, పెత్తందార్ల చర్యలను ఎదుర్కోవాలని, తగు విధంగా పోరాటాలను రూపొందించుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయ మూర్తుల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల ప్రాతినిధ్యంపై పార్లమెంట్‌లో సైతం చర్చ జరగటాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని విల్సన్ చెప్పారు.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ సమితి నిర్వహించిన కార్యకలాపాలను వివరించారు. రాజ్యాంగ రక్షణ, కర్తవ్యం, చట్టాలను నీరుగార్చే చర్యలపై పోరాటాలను కొనసాగించాలన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర మహాసభలు జరుపుకునేందుకు సమాయత్తం కావాలన్నారు. అనేక గ్రామాలలో కనీసం శ్మశాన స్థలాలు, మంచినీరు, రోడ్లు లేకపోవటం వంటి సమస్యలు, ఇతర అంశాలను పరిగణలోనికి తీసుకుని ఆందోళనలను, కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, నాయకులు నాగరాజు, ఆర్. గురుదాసు, సీహెచ్.మహేశ్, సుధీర్, పందిటి మోహన్, శివప్రకాశ్, కళింగ లక్ష్మణరావు, యడ్ల గోపి, రాంబాబు, రాజబాబు, లోవ రాజు, రామకృష్ణ, మురళి, రత్నకుమార్, ఎస్.రాజు, పోలారావు పాల్గొన్నారు.

యూపీలో దళిత యువతిపై దారుణం

లైంగిక దాడిని ప్రతిఘటించినందుకు వేడి నూనెలోకి తోసివేత

లక్నో: దేశంలో దళితులపై రోజురోజుకీ అఘాయిత్యాలు, దాడులు పెరిగిపోతున్నాయి. లైంగిక వేధింపులను ప్రతిఘటించడంతో దళిత యువతిని వేడి నూనెలోకి తోసివేయడంతో ఆమె శరీరంలో సగానికిపైగా కాలిన గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ధనౌరా సిల్వర్‌నగర్ గ్రామంలోని ఆయిల్ మిల్లులో 18 ఏళ్ల యువతి, ఆమె కుటుంబ సభ్యులు పని చేస్తున్నారు. శనివారం మిల్లు యజమాని ప్రమోద్, అతడి అనుచరులు రాజు, సందీప్ ఆ యువతిని లైంగికంగా వేధించారు. ఆమె అభ్యంతరం చెప్పడంతో కులం పేరుతో దూషించారు. అనంతరం అక్కడ కళాయిలో కాగుతున్న వేడి నూనెలోకి ఆ యువతిని తోసేశారు. కాగా, దళిత యువతి శరీరంలో సగానికిపైగా కాలిన గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఢిల్లీలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువతి సోదరుడి ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులైన నూనె మిల్లు యజమాని ప్రమోద్, అతడి అనుచరులు రాజు, సందీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

పౌరోహిత్యాన్ని కులవృత్తిగా గుర్తించాలి

ఎంపీ జీవీఎల్‌కు బ్రాహ్మణ సమాఖ్య వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించేలా కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు హామీ ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నేతలు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన జీవీఎల్‌ను విశాఖలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ విశ్రాంత డైరెక్టర్ యామిజాల, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీ సలహాదారు చెరువు రామకోటయ్యతో పాటు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు తెన్నేటి సునీల్ శర్మ, మేడవరపు లక్ష్మణరావు, శివగణేష్, రాజేష్, సాయి, కే సుబ్రహ్మణ్య శర్మ కలిసి బ్రాహ్మణులకు సంబంధించి అనేక సమస్యలపై వివరించగా... జీవీఎల్ సానుకూలంగా స్పందించారని, వీటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారని తెలిపారు. అన్ని కులాలకు ఇస్తున్నట్లుగానే కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి బ్రాహ్మణులకు కూడా ప్రభుత్వం స్థలం ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది పురోహితుల పరిస్థితి దయనీయంగా ఉందని, పౌరహిత్యాన్ని కులవృత్తుల జాబితాలో చేర్చాలని నేతలు కోరారు. పురోహితులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక లక్షలాది మంది పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వైదిక వృత్తి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే ఈ దుర్భర పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

జ్ఞానవాపిపై వివాదాస్పద తీర్పు

న్యూఢిల్లీ:
ఉత్తరభారతం రామ మందిర నిర్మాణ విజయోత్సవంలో మునిగి ఉంది. అయితే ఈ సంతోషాతిరేకాలతో ఇదివరకు ఉన్న మసీదులు హిందూ దేవాలయాలన్న వాదన గట్టిగా కొనసాగుతోంది. రాజ్యాంగానికి అనుగుణంగా పరిపాలన నిర్వహించవలసిన కేంద్ర ప్రభుత్వం ఇలాంటి మతతత్వ చర్యలకు ఊతం ఇస్తోంది. హిందూయిజం ఒక మతం కాదు జీవన విధానం అని మూడు దశాబ్దాల కిందట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.ఎస్.వర్మ స్పష్టం చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇతర మతాల కట్టడాలను నిరాకరించడమే కాక ఒకప్పుడు దేవాలయాలు అని వాదించి ఒక విపరీత మతవాదాన్ని అమలు చేస్తున్నారు. పైగా న్యాయస్థానాలు ఇలాంటి మతోన్మాద వాదనలకు ఊతం ఇవ్వడంవల్ల 1951నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని అంశాలు మత వ్యవహారాలను రాజకీయాలకు వినియోగించుకోకూడదని చెప్పినా ఖాతరు చేసే వారే కనిపించడం లేదు.

ఈ పరిస్థితిని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్.), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బాగా వినియోగించుకుంటున్నాయి. హిందూమతం మతం కాదు జీవన విధానం అన్న మాటను తమకు అనువుగా మలచుకుంటున్నాయి. కానీ జ్ఞానవాపి మసీదుపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఆర్.ఆర్. అగర్వాల్ వెలువరించిన తీర్పు కల్లోలం రేపింది. ఆ న్యాయమూర్తి 1991నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి కొత్త భాష్యం చెప్పారు. ఇది పూర్తిగా బీజేపీ అనుకూలమైందే కాక ఆ చట్టాన్ని తృణీకరించేది. 1991 నాటి చట్టం ప్రకారం 1947 ఆగస్టు 15న ఉన్న ప్రార్థనా స్థలాల స్వభావాన్ని మార్చడానికి వీలు లేదు. సుప్రీంకోర్టు రామ మందిరం విషయంలో ప్రార్థనా స్థలాల చట్టానికి దేశ సెక్యులర్ విధానాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ఉందని తెలియజేసింది. ఈ చట్టం మన చరిత్రను, భవిష్యత్తును విడమర్చింది అని కూడా పేర్కొంది. స్వాతంత్ర్యం మన పాత గాయాలను మాపిందని కూడా తెలియజేసింది.

1991 నాటి బిల్లు మీద చర్చ సందర్భంగా కొంతమంది బీజేపీ పార్లమెంటు సభ్యులు 1947 ఆగస్టుకు ఉన్న ప్రామాణికత ఏమిటి అని కూడా ప్రశ్నించారు. న్యాయమూర్తి అగర్వాల్ చెప్పిన భాష్యం ప్రకారం మసీదు అంటే వాస్తుపరమైన, ఆచారాలపరమైన, మత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలనీ దేవాలయాలు, చర్చీలకు ఇలా ఉండదని వ్యాఖ్యానించారు. కానీ ఇతర మతాల ప్రార్థనా స్థలాలు కూడా హిందు మతాల ఆచారా లను పాటిస్తున్న ఉదాహరణలున్నాయి. ఉదాహరణకు దక్షిణాసియాలోని చెరమన్ జుమా మసీదులో దీపాలు వెలిగించే ఆచారం కొనసాగుతోంది. వెయ్యేళ్లుగా అక్కడ నూనెతో దీపాలు వెలిగిస్తున్నారు. అన్ని మతాలవారూ దీపం వెలిగించడానికి నూనె తీసుకువస్తుంటారు. ఈ బహుళత్వ సంప్రదాయం అనాదిగా కొనసాగుతోంది. సిక్కుల స్వర్ణ దేవాలయానికి పునాది వేసే బాధ్యతను సిక్కు గురువు అర్జున్ దేవ్ ముస్లిం సాధువు మియా హజ్రత్ మీర్‌కు అప్పగించిన సంప్రదాయం మనది. మరి చెరమాన్ మసీదుకు, స్వర్ణ దేవాలయానికి న్యాయమూర్తి అగర్వాల్ ఏ భాష్యం చెప్తారో.

న్యాయమూర్తి అగర్వాల్ తీర్పు సమస్యను పరిష్కరించకపోగా అగ్నికి మరింత ఆజ్యం పోసింది. ఆరు నెలలలోగా జ్ఞాన్ వ్యాపి మసీదుపై తీర్పు చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశాన్ని ఆసరగా చేసుకుని ఆయన ఈ విద్దూరమైన తీర్పు వెలువరించారు. ఇది సెక్యులర్ విధానాలను దెబ్బ తీస్తుంది. అతి పెద్ద మైనారిటీ వర్గం అయిన ముస్లింలలో కల్లోలం రేపుతుంది. ఇదంతా మసీదులను పడగొట్టి దేవాలయాలు నిర్మించే సంకుచిత విధానానికి అనువుగానే సాగుతోంది. ఇది మెజారిటీ మత వాద ఆధిపత్యాన్ని కొనసాగించడానికే ఉపకరిస్తుంది. ఇది మన ఒక్క దేశానికి మాత్రమే పరిమితమైంది కాదు. టర్కీ పాలకుడు ఎర్దొగాన్ హాజియా సోఫియాను మసీదు కింద మార్చడానికి అనుమతించి ఒట్టొమాన్ ఖలిఫా సంప్రదాయాన్ని పునరుద్ధరిస్తున్నానని చెప్పుకుంటున్నారు.

భారత్‌కు టర్కీకి మధ్య ఉన్న తేడా ఏమిటంటే టర్కీలో మార్పులవల్ల మతపరమైన మైనారిటీలకు ప్రమాదం లేదు. అక్కడి జనాభాలో 99 శాతం మంది సున్నీలే. కానీ భారత్‌లో ముస్లింలు మొత్తం జనాభాలో 14.5 శాతం మంది ఉన్నారు. అందువల్ల పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మన దేశంలో మొగలు పాలకులైనా, హిందూ రాజులైనా ఇష్టారాజ్యంగా నడిపిన వారే తప్ప వారు ఎన్నికలలో పాల్గొన్న వారు కాదు. అప్పుడు రాజ్యవిధానం అంటే పాలకుడి ఇష్టా రాజ్యమే.

వారణాసి, మథుర లాంటి చోట్ల ఔరంగజేబు దేవాలయాలను ధ్వంసం చేయడానికి రాజకీయ కారణాల న్నారు. మథురలో జాట్లు చాలా కాలం మొగలులను ఎదిరించారు. మరో కారణం ఏమిటంటే ఔరంగ్ జేబు సోదరుడు దారా షుకో మథురలో శ్రీకృష్ణుడి దేవాల యానికి మద్దతిచ్చాడు. అప్పుడు వారణాసిలో బ్రాహ్మ ణులు హిందూ మత గ్రంథాలను వక్రీకరించి బోధించే వారు. మొగల్ చక్రవర్తులు అనేక దేవాలయాలకు మాన్యాలు ఇచ్చారు. డబ్బు మంజూరు చేశారు. అసోం లోని గువహటిలోని ఉమానంద దేవాలయానికి ఔరంగ జేబు మాన్యాలు ఇచ్చాడు. నిష్ఠా గరిష్ఠులైన బ్రాహ్మణులకు, ఫకీర్లకు ఇళ్లు నిర్మించడానికి ఔరంగ జేబు వారణాసిలో గంగా నది ఒడ్డున భూమి కేటాయించారు.

చిత్రకూట్‌లో బాలాజీ దేవాలయం కోసం 1691లో ఔరంగ్ జేబ్ మహంత్ బాలక్ దాస్‌కు ఎనిమిది గ్రామాలతో పాటు పన్ను లేకుండా చాలా భూమి ఇచ్చాడు. అలహాబాద్, బృందావనం, బీహార్ మరికొన్ని చోట్ల కూడా ఔరంగ్ జేబు దేవాలయాలకు పన్ను చెల్లించనవసరం లేని భూములు ఇచ్చారు. ఒక వేళ ముస్లింలు హిందూ దేవాలయాలకు ఇచ్చిన భూములు తిరిగి ఇచ్చేయాలని కోరితే పరిస్థితి ఎంత దుర్భరంగా తయారవుతుందో ఊహించడం కూడా కష్టమే.

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ58

25 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: పీఎస్ఎల్వీ-సీ 58 సోమవారం నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇందుకోసం కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం 8.10 గంటలకు ప్రారంభమైంది. కొత్త సంవత్సరం మొదటి రోజు ప్రతిష్ఠాత్మక ప్రయోగానికిగాను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆంధ్రప్రదేశ్, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి సోమవారం ఉదయం 9.10 గంటలకు పీఎస్ఎల్వీ-సీ58 వాహకనౌక షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లనుందని, 25 గంటల కౌంట్‌డౌన్ మొదలైందని ఇస్రో వర్గాలు తెలిపాయి. భారత్‌కు చెందిన ఎక్స్‌పో-శాట్‌ను నిర్దేశిత కక్ష్యలోకి పీఎస్ఎల్వీ-సీ58 ప్రవేశపెట్టనుందని పేర్కొన్నాయి. ఎక్స్-రే మూలాల అన్వేషణే ఎక్స్‌పో-శాట్ లక్ష్యం కాగా దీని జీవిత కాలం ఐదేళ్లుగా వెల్లడించాయి. ఎక్స్‌రే కిరణాలపై అధ్యయనం కోసం జరుపుతున్న ఈ ప్రయోగం భవిషత్ ప్రయోగాలకు ఉపయుక్తంగా ఉంటుందని, టెలిస్కోప్‌లా ఉపయోగపడే ఈ ఉపగ్రహం ఎన్నో అంతరిక్ష రహస్యాలను ఛేదించబోతుం దన్నాయి. అలాగే కిలో బరువు కలిగిన కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన వీఐపై అనే నానో ఉపగ్రహాన్ని కూడా అంతరిక్షంలోకి పంపనున్నట్లు తెలిపాయి. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డీ1 మిషన్ అక్టోబరులో విజయంతో 60వ మిషన్‌గా పీఎస్ఎల్వీ-సీ58ను ఇస్రో చేపట్టింది. ఈ మిషన్‌లో భాగంగా ప్రాథమిక పేలోడ్ ఎక్స్‌పో శాట్, 10 ఇతర ఉపగ్రహాలను భూమికి కిందిస్థాయి కక్ష్యల్లో పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ చేరుస్తుంది. జనవరి 1న జరగబోయే ప్రయోగంతో అంతరిక్ష రంగ పరిశోధనలలో కీలకంగా నిలుస్తుందని ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. 44.4 మీటర్ల పొడవైన పీఎస్ఎల్వీ రాకెట్ ముందుగా ప్రాథమిక ఉపగ్రహాన్ని 650 కిమీల భూమి కింది కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ప్రయోగించిన 21 నిమిషాలకు ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది.

విశాఖలో దారుణం

యువతిపై సామూహిక అత్యాచారం?

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం:
విశాఖలో దారుణం చోటు చేసుకుంది. నగరానికి చెందిన ఓ యువతి సామూహిక అత్యాచారానికి గురైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే పోలీసులు 11 మంది నిందితులను అదుపులోకి తీసుకొని రహస్యంగా విచారిస్తున్నట్టు సమాచారం. కేసుకు సంబంధించి ప్రాథమిక వివరాలు ఇలా ఉన్నాయి... విశాఖ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ యువతి, ఓ యువకుడిని ప్రేమించింది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం యువకుడు ఆమెను మాట్లాడుకుందాం రమ్మని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ గదికి తీసుకెళ్లాడు. అక్కడ వీరిద్దరూ శారీరకంగా కలిసిన తర్వాత... యువకుడు అతని ఫ్రెండ్ కి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో యువకుడి స్నేహితుడు అక్కడికి చేరుకొని, యువతిని బెదిరించి బలవంతంగా అత్యాచారం చేశాడు. తాను ప్రేమించిన వాడే అతని స్నేహితుడితో అత్యాచారం చేయించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువతి... ఆర్కే బీచ్‌కి చేరుకొని ఒంటరిగా కూర్చోగా... అదే బీచ్‌లో సందర్శకులను ఫోటోలు తీసే ఓ ఫోటోగ్రాఫర్ ఆమె పరిస్థితిని గమనించి ఓదార్చినట్టు నటించాడు. నేనున్నానంటూ నమ్మించి స్నేహితుల గదికి తీసుకువెళ్లాడు. ఆ గదిలో ఫోటోగ్రాఫర్‌తో పాటు మరో ఏడుగురు యువకులు కలిసి యువతిని హింసించి... బలవంతంగా రెండు రోజులపాటు అత్యాచారం చేశారు. దీంతో ఆమె వారి చెర నుండి తప్పించుకుని అక్కడ నుండి పారిపోయింది. మరోపక్క కుమార్తె ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు ఆమె ఆచూకీని గుర్తించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసును డీసీపీ1 శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నట్టు తెలిసింది. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే పోలీసులు ఈ కేసుకు సంబంధించి అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని వెల్లడించలేదు.



సామాజిక స్ఫూర్తి కలిగించే కవిత్వానికే ఆదరణ

కవి జూలూరు గౌరీశంకర్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్):
సమాజం నుంచి స్ఫూర్తి పొందిన కవిత్వమే సమాజాన్ని కదిలించగలదని పాత్రికేయుడు కవి జూలూరు గౌరీశంకర్ చెప్పారు. ప్రజల భావాలను వ్యక్తం చేయలేని కవిత్వం, కళలకు ప్రజల ఆదరణ లభించదన్నారు. 34వ పుస్తక మహోత్సవం నాలుగో రోజైన ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై 'జూలూరు పథం' పేరుతో గౌరీశంకర్ రాసిన దీర్ఘకవిత పుస్తకాన్ని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించారు. కవిత్వంపై సాహిత్యం, సమాజం ప్రభావం గురించి నారాయణ, గౌరీశంకర్ ముఖాముఖీ చర్చ నిర్వహించారు. కవులు, సాహిత్యకారులు సమాజంలో మార్పుకు స్ఫూర్తినిస్తూ, సమాజ పరిణామంలో వివిధ దశలకు దోహదం చేస్తారని చెప్పారు. కళ కోసం కళ పరిమితం కాకూడదు ప్రజల కోసం వ్యక్తీకరించబడినప్పుడే దానికి ఆదరణ లభిస్తుంది. ప్రజల భావాలను కవిత్వం, కళలో కనిపిస్తేనే ప్రజలు ఆదరిస్తారు అని వారన్నారు. తెలంగాణ ఉద్యమం లాంటి అనేక ఉద్యమాల విజయానికి సంగీతం, సాహిత్యం దోహదమైనట్లు తెలిపారు. సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ యాత్రలో అశ్లీల నృత్యం

లక్నో:
బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' కార్యక్రమంలో ఒక మహిళ అశ్లీల నృత్యం చేసింది. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ, గ్రామపెద్ద వేదిక వద్ద ఉండగానే ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో దృశ్యం సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది. బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేంద్ర పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో కార్యక్రమాలను బీజేపీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం భోజ్‌పూర్ ప్రాం తంలోని షకుర్‌పూర్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పెద్ద, ఆయన భార్య, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు హాజరయ్యారు. కాగా, ఈ సంద ర్భంగా బాలీవుడ్ సినిమాలోని 'ఛత్ పే సోయా థా బెహ్నోయి' పాటకు ఒక మహిళ అసభ్యకరంగా నృత్యం చేసింది. దీంతో బీజేపీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ప్రజాప్రతినిధులు వెళ్లిన తర్వాత స్థానిక ప్రజలకు వినోదం కోసం మహిళతో డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.